ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

3

శుక్రవారం 17 అక్టోబరు 2025

హంద్రీ-నీవాలో కృష్ణమ్మ ప్రవాహానికి పదేపదే ఆటంకాలు, అవరోధాలు. మోటార్లు మొరాయించడం, ప్యానల్ బోర్డులు కాలిపోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం. లైన్‌ట్రిప్ కావడం. యధావిధిగా నీరు ముందు కెళ్లడం. కాలువ పొంగిపోవడం, గట్లు తెగిపోవడం.. ఇదీ తరచూ హంద్రీ-నీవాలో ఎదురవుతున్న ఇబ్బందులకు సాంకేతిక సమస్యలతో పాటు మానవ తప్పిదాలు కూడా ఉన్నాయని తెలుస్తోంది. తాజాగా బి.కొత్తకోట మండలం గుండ్లపల్లె వద్ద కాలువ తెగి కృష్ణా జలాలు మొత్తం ఏటి పాలయ్యాయి. కాలువ మరమ్మతులకు అధికారులు శ్రమిస్తున్నారు.

జీఎస్టీతో ప్రజలందరికీ లబ్ధి



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో ప్రజలందరికీ లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌లో భాగంగా గురువారం వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని శివాలయం సర్కిల్ నుంచి నేతాజీ సర్కిల్ (బంగ్లా) వరకు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో సదస్సు నిర్వహించారు. ర్యాలీని కలెక్టర్ నిశాంత్‌కుమార్, టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి, జిల్లా అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ర్యాలీలో భాగంగా ప్రజలందరికీ జీఎస్టీ 2.0 వల్ల కలిగే లబ్ధి గురించి అవగాహన కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ఒక దేశం- ఒక పన్ను అనే సిద్ధాంతంలో కేంద్ర ప్రభుత్వం 2017లో జీఎస్టీని ప్రవేశపెట్టిన అనంతరం ప్రస్తుతం అమలులోకి వస్తున్న జీఎస్టీ 2.0 దేశంలోని అతి పెద్ద ఆర్థిక సంస్కరణల్లో ఒకటని తెలిపారు. దీని ద్వారా 99 శాతం వస్తువులపై పన్ను రేట్లు తగ్గి ప్రజలకు లాభం చేకూరుతుందని వివరించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీవో ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రవి, అసిస్టెంట్ కమిషనర్ సౌమ్య, వివిధ కంపెనీల ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ్మా..

కారణాలేమమ్మా..!



బి.కొత్తకోట మండలం గుండ్లపల్లె వద్ద తెగిన హంద్రీ-నీవా కాలువ

- హంద్రీ-నీవాలో ఎస్కేప్ ఎక్కడ?
- స్కడా సిస్టమ్ ఏమైంది?
- డెడికేటెడ్ లైన్‌లో విద్యుత్ అంతరాయమా!
- హంద్రీ-నీవా కాలువ తెగిపోవడం ఎవరి తప్పిదం?
- అధికారులను వేధిస్తున్న ప్రశ్నలు

మదనపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎత్తిపోతల పథకాల ఆధారంగా జరిగే నీటి ప్రవాహంలో కాలువ వెంబడి అక్కడక్కడా ఎస్కేప్‌లు నిర్మించాలి. సంపునకు, సంపునకు (పంప్‌హౌస్) మధ్యలో హంద్రీ-నీవా కాలువ... వంకలు, వాగులు క్రాస్ చేసే క్రమంలో వీటిని ఏర్పాటు చేయాలి. కృష్ణమ్మ ముందుకెళ్లే క్రమంలో ఎక్కడైనా లిఫ్ట్‌లో లేదా మోటార్‌లో సాంకేతిక సమస్యతో పనిచేయకపోయినా, విద్యుత్ సరఫరా ఆగిపోయినా ఎస్కేప్ సిస్టం చాలా ఉపయోగపడుతుంది. పంపులన్నీ ఒకే సిరీస్‌లో ఉన్నప్పుడు వెనుక భాగాన ఉన్న లిఫ్ట్‌లు పనిచేస్తూ, ముందు వైపున ఉన్న సంపుల్లో సమస్య వస్తే కాలువలు నిండి తెగిపోయే ప్రమాదం ఉంది. అదే ఈ మధ్యలో ఎస్కేప్ సిస్టం ఉంటే నిండిన నీరంతా ఆ పద్ధతి ద్వారా బయటకు వెళ్లిపోయి కాలువ సేఫ్‌గా ఉంటుంది. కానీ హంద్రీ-నీవాపై పుంగనూరు, కుప్పం బ్రాంచ్‌కెనాల్‌లో ఒకటి రెండు చోట్ల తప్ప ఎక్కడా ఇవి లేవు. ఈ వ్యవస్థ లేనందునే బి.కొత్తకోట మండలం గుండ్లపల్లె వద్ద కాలువ తెగిపోవడానికి కారణమైందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. ఇదే వ్యవస్థ హంద్రీ-నీవా మొదటి ఫేజ్‌లోని కర్నూలు నుంచి అనంతపురం ప్రధాన కాలువ వెంబడి ఉన్నాయి. ఇక్కడ మాత్రం చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు హంద్రీ-నీవా అధికారులు వీటిపై దృష్టి సారిస్తున్నారు.

స్కడా సిస్టం ఉన్నట్లా.. లేనట్లా?

సూపర్ వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్ నే స్కడా సిస్టం అంటారు. పారిశ్రామిక ప్రక్రియలను రిమోట్‌గా పర్యవేక్షించడానికి, నియంత్రించడానికి ఉపయోగించే వ్యవస్థ ఇది. హంద్రీ-నీవా పథకంలో తీసుకుంటే ఒక పంపుహౌస్ నుంచి మరో పంపుహౌస్‌కు సాంకేతిక పరంగా కంప్యూటర్‌కు (చిప్) అనుసంధానమై ఉండాలి. ఇందులో ఒక పంపుహౌస్‌లో ఒక మోటారు వివిధ కారణాలతో ఆగిపోతే స్టాండ్‌బైగా (ప్రత్యామ్నాయంగా) ఏర్పాటు చేసిన మరో మోటారు ఆటోమెటిక్‌గా ఆన్ అవుతుంది. అలాగే ఇక్కడ ఒక పంపుహౌస్‌లో ఒకేసారి నాలుగు మోటార్లు ఆగిపోయినా, పనిచేయకపోయినా దానికి ముందున్న అన్ని పంపింగ్ స్టేషన్లూ ఆటోమేటిక్‌గా నిలిచిపోయి నీటి విడుదల ఆగిపోతుంది. లేకుంటే ఒకే లైన్‌లో కాలువ మీద పంపులు ఉన్నప్పుడు (సిరీస్) మధ్యలో ఏదైనా పంపింగ్ స్టేషన్ ఆగిపోయి మిగతా పంపులు పని చేస్తుంటే నీటి ప్రవాహం ముందుకు వస్తూనే ఉంటుంది. అలాంటి సమస్య వచ్చినప్పుడు నీటిని ఎత్తిపోసే అవకాశం లేక కాలువలు ఎక్కడికక్కడ తెగిపోయే అవకాశం ఉంది. తాజాగా బి.కొత్తకోట మండలం గుండ్లపల్లె వద్ద జరిగిన సంఘటనే ఇందుకు ఉదాహరణ. హంద్రీ-నీవా కాలువల్లో లిఫ్ట్‌లు ఏర్పాటు చేసే క్రమంలో కాంట్రాక్టర్లతో కుదుర్చుకున్న ఒప్పందం (అగ్రిమెంట్)లో ఈ స్కడా సిస్టం ఉందా? లేదా అన్న దానిపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

విద్యుత్ నిలిచిపోయే అవకాశమే లేదు

హంద్రీ-నీవా కాలువ వెంబడి ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లలో కరెంటు సరఫరాలో అంతరాయం కలిగే అవకాశం లేదు. అందుకు అనుగుణంగానే హంద్రీ-నీవాకు ప్రత్యేకంగా సబ్‌స్టేషన్లు నిర్మించారు. ఇందుకోసం హంద్రీ-నీవా అధికారులు విద్యుత్ శాఖకు ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్లు చెల్లించారు. వీటి నుంచి రైతులకు వ్యవసాయానికి, గ్రామాలకు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఇవ్వకూడదని ఆ శాఖాధికారులు చెబుతున్నారు. అందుకే వీటిని ఎక్స్‌క్లూజివ్ లేదా డెడికేట్ విద్యుత్ లైన్లు అంటారు. కేవలం వీటి కోసం ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్లు, కాలువ వెంబడి లాగిన లైన్లు ట్రిప్ అయ్యేది చాలా అరుదు. వినియోగం లోడు ఎక్కువగా వాడినప్పుడే లైన్ ట్రిప్ అవుతుంది. అంటే హంద్రీ-నీవాకు వినియోగించే సబ్‌స్టేషన్ నుంచి సాధారణ సప్లయ్‌గా వాడినట్లు తెలుస్తోంది. ఒకవేళ అనుకోని రీతిలో విద్యుత్ సరఫరా ఆగిపోయినా, మరమ్మతులు వచ్చినా కేవలం 30 నిమిషాల్లో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరఫరా ఇవ్వాల్సి ఉంది. ఈ విషయాన్ని అటు హంద్రీ-నీవా అధికారులు, ఇటు ట్రాన్స్‌కో అధికారులు గుర్తించినట్లు లేదు.

తరిగోడు వద్ద తంటా..!

సత్యసాయి జిల్లా చెర్లోపల్లె నుంచి ముందుకొస్తున్న కృష్ణమ్మ బి.కొత్తకోట మండలం గుండ్లపల్లె వద్ద మొరాయించింది. జిల్లాలోకి ప్రవేశించే పీటీఎం మండలం 9, 10, 11 లిఫ్ట్‌లు దాటి తరిగోడు లిఫ్ట్‌కు చేరుకోగానే విద్యుత్ సరఫరా లేక మోటార్లు పనిచేయడం ఆగిపోయాయి. దీంతో ముందుకొచ్చిన నీటిని దారి మళ్లించే క్రమంలో పంపుహౌస్‌కు కాస్త దగ్గర్లో కాలువను తెంచగా, ఆ నీరు ముందుకు వెళ్లకుండా కాలువగట్టు వెంబడి రావడంతో మట్టి కొట్టుకుపోయినట్లు చెబుతున్నారు. అప్పటికే బలహీనంగా మారిన మట్టికట్ట తెగిపోవడంతో కృష్ణాజలాలు ఏటిపాలయ్యాయి. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి లైన్ ట్రిప్ అయిందని చెబుతున్నారు. ఈ క్రమంలో పలుమార్లు మోటార్లను ఆన్ చేయడానికి ప్రయత్నించినా పదే పదే లైన్ ట్రిప్ అయినట్లు తెలిసింది. ఇలా పది నుంచి 12 గంటలకుపైగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో కాలువలో ప్రవాహం పెరిగి కాలువ కట్ట తెగిపోయింది. ఈ క్రమంలో వెనుకనున్న మూడు సంపులతో పాటు చెర్లోపల్లెలో నీటిని ఆపేయడంతో కృష్ణమ్మ ప్రవాహానికి బ్రేక్ పడింది. కాలువ ఇదే చోట ఇప్పటికే రెండుసార్లు తెగిపోగా, తాజా సంఘటనతో మూడోసారిగా చెబుతున్నారు. కాలువ హంద్రీ-నీవాలో కృష్ణమ్మ ప్రవాహానికి పదేపదే ఆటంకాలు, అవరోధాలు. మోటార్లు మొరాయించడం, ప్యానల్ బోర్డులు కాలిపోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం. లైన్‌ట్రిప్ కావడం. యధావిధిగా నీరు ముందుకెళ్లడం. కాలువ పొంగి పోవడం, గట్లు తెగిపోవడం.. ఇదీ తరచూ హంద్రీ-నీవాలో ఎదురవుతున్న ఇబ్బందులకు సాంకేతిక సమస్యలతో పాటు మానవ తప్పిదాలు కూడా ఉన్నాయని తెలుస్తోంది. తాజాగా బి.కొత్తకోట మండలం గుండ్లపల్లె వద్ద కాలువ తెగి కృష్ణా జలాలు మొత్తం ఏటిపాలయ్యాయి కాలువ మరమ్మతులకు అధికారులు శ్రమిస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

- ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య



సీటీఎం సబ్‌స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య

మదనపల్లె టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఉద్యోగులు కృషి చేయాలని ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య తెలిపారు. గురువారం మదనపల్లె మండలం సీటీఎం వద్ద 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను టెక్నికల్ డైరెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పనితీరు, రైతులకు ఉచితంగా అందిస్తున్న 9 గంటల విద్యుత్‌పై ఆరా తీశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. విద్యుత్ సరఫరాలో లాసెస్‌ను తగ్గించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు పీఎం సూర్యఘర్ పథకం కింద రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్‌ను ఆదా చేయడంతో పాటు, ఉత్పత్తి అయిన మిగులు విద్యుత్‌ను ఎస్పీడీసీఎల్‌కు విక్రయించవచ్చన్నారు. ఈ యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకర్లు రుణాలు కూడా ఇస్తున్నారన్నారు. గృహ, పరిశ్రమల వినియోగదారులు ఉపయోగిస్తున్న అదనపు విద్యుత్ లోడును క్రమబద్ధీకరించుకోవడానికి సబ్సిడీ చెల్లింపు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక ఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయంలో డివిజన్‌లోని ఏడీఈలు, ఏఈలతో టెక్నికల్ డైరెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఈ గంగాధరం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు కస్టడీకి నిందితులు

- మదనపల్లెలోనే 10 మంది నిందితుల విచారణ
- విచారించనున్న ఈఎస్, అసిస్టెంట్ ఈఎస్ బృందం



ములకలచెరువు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో పది మంది నిందితులను శుక్రవారం ఉదయం ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకోనున్నారు. నిందితులను మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌లోనే విచారించేందుకు ఉన్నతాధికారులు సన్నద్ధమయ్యారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, ఏఈఎస్ జోగేంద్ర, ములకలచెరువు ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్‌లతో కూడిన బృందం నిందితులను విచారించే అవకాశం ఉంది. నకిలీ మద్యం కేసులో ఏ 13 నిందితుడిగా ఉన్న పెద్దతిప్పసముద్రం మండలం కమ్మవారిపల్లెకు చెందిన కట్టా సురేంద్రనాయుడును శుక్ర, శని, ఆదివారాలు కస్టడీకి ఇవ్వడంతో అతడిని మూడు రోజుల పాటు విచారించనున్నారు. అలాగే మిగిలిన తొమ్మిది మంది నిందితులను శుక్ర, శని వారాల్లో రెండు రోజుల పాటు విచారిస్తారు. తొలుత ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్‌కు నిందితులను తీసుకొచ్చి విచారించాలని ఎక్సైజ్ అధికారులు భావించారు. ఇక్కడ తగిన సౌకర్యాలు లేకపోవడంతో పాటు మదనపల్లె నుంచి ములకలచెరువుకు తీసుకురావడానికి 43 కిలోమీటర్ల దూరం ఉండడంతో మదనపల్లెలోనే విచారించాలని నిర్ణయించారు. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మద్దేపల్లి జనార్దన్‌రావును అరెస్టు చూపేందుకు అనుమతి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లెలో దాఖలు చేసిన పీటీ వారెంట్‌పై విచారణను జడ్జి వాయిదా వేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. దీపావళి పండుగ తరువాత పీటీ వారెంట్‌పై విచారణ జరిగే అవకాశం ఉంది. అలాగే ఈ కేసులో ఏ23గా ఉన్న కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లెకు చెందిన శ్రీనివాసులురెడ్డి పీటీ వారెంట్‌పై విచారణ కూడా వాయిదా పడింది.

సాహిత్య సేవలను విస్తృతం చేస్తాం

- వీసీ బెల్లంకొండ రాజశేఖర్



బ్రౌన్ గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న వైవీయూ వీసీ బెల్లంకొండ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం వేదిక గా తెలుగు భాషా సాహిత్యాలను మరింత విస్తృత పరుస్తామని వైవీయూ వీసీ ప్రొఫెసర్ బెల్లం కొండ రాజశేఖర్ అన్నారు. ఇటీవల వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారిగా గురువారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. బ్రౌన్ గ్రంథాలయం వెనుక నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలను పరిశీలించారు. బ్రౌన్ నివాసమున్న బంగళా, సమాధి చిత్రాలను పరిశీలించి బ్రౌన్ సాహితీ సేవలను, గ్రంథాలయ నిర్మాణానికి ఎవరెవరు ఎంత కృషిచేశారన్న అంశాలను తెలుసుకున్నారు. భాషా పరిశోధన కేంద్రంలో ఉన్న పుస్తకలను, తాళపత్ర గ్రంథాలను, హ్యాండ్‌మేడ్ పేపర్స్, తామ్రపత్రాన్ని, సిద్ధాంత గ్రంథాలను, బ్రౌన్ రచనలను పరిశీలించారు. గ్రంథాలయ నిర్వహణ, విధివిధానాలను తెలుసుకుని సాహిత్యపరంగా బ్రౌన్ కేంద్రా న్ని మరింత ఉన్నతికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.పద్మ, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది, సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, సంచాలకులు ఆచార్య జి.పార్వతి, సహాయపరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

దీపావళికి ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు/కడప, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని గుంతకల్లు రైల్వే డివిజన్ మీదుగా పలు సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి-సికింద్రాబాద్ ప్రత్యేక రైలును (నంబర్ 07497) ఈ నెల 17న, దీని తిరుగు ప్రయాణపు రైలును (07498) 18న నడుపుతారు. ఈ రైలు బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, సూలేహళ్లి, యాదగిరి, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుంది.

అదే విధంగా షోలాపూర్-ధర్మవరం ప్రత్యేక రైలును (01437) ఈ నెల 16న, దీని తిరుగు ప్రయాణపు రైలును (01438) ఈ నెల 18న నడుపుతారు. ఈ రైలు కురుద్వాడి, బర్సి టౌన్, ధారాశివ్, లాతూరు, లాతూరు రోడ్, ఉద్గిర్, భల్కి, బీదర్, వికారాబాద్, యాదగిరి, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లి రోడ్డు, మెలకలచెరువు, కదిరి స్టేషన్ల మీదుగా ధర్మవరానికి చేరుకుంటుంది.



ఆకాశం మేఘావృతం అవుతుంది.. మబ్బులు కాస్త బూడిదరంగులోకి మారి వర్షం కురిపిస్తాయి. అచ్చమైన తెల్లమేఘాలు ఒక్కోసారి ఆకాశంలో షికారు చేస్తుంటాయి. పాలలాంటి ఈ మబ్బులు కొండలపై వాలి ముచ్చట్లు చెప్పడం అరుదు. ఈ చిత్రం అలానే ఉంది. నందలూరు వద్ద గురువారం సాయంత్రం ఈ దృశ్యం కనువిందు చేసింది.

- ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

సమర్థవంతంగా రీసర్వే చేపట్టండి

- డీఎస్ఎల్‌వో భరత్‌కుమార్



అమ్మళ్లబండకోట గ్రామంలో రీసర్వే పనులను పరిశీలిస్తున్న జిల్లా సర్వే అధికారులు

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ గ్రామాల్లో చేపడుతున్న రీసర్వే ఫేజ్-3ని రెవెన్యూ అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా సర్వే అండ్ ల్యాండ్స్ అధికారి (డీఎస్ఎల్‌వో) భరత్‌కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం మల్లెల సచివాలయ పరిధిలోని అమ్మళ్లబండకోట రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న రీసర్వే ఫేజ్-3ని డిప్యూటీ డైరెక్టర్ పి.వి.జయరాజ్‌తో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడుతూ అమ్మళ్లబండకోట రెవెన్యూ గ్రామంలో మొత్తం 44 సర్వే నెంబర్లు ఉన్నాయని, 325.22 ఎకరాల భూమి ఉందని, అందులో ఇప్పటి వరకు 213.75 ఎకరాల భూమిని రీసర్వే పూర్తి చేశారన్నారు. పెండింగ్ భూమిని తక్షణం రీసర్వే చేసి రికార్డులను పక్కాగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. రీసర్వే సిబ్బంది రోజూ కనీసం 20 ఎకరాలకు తక్కువ కాకుండా రీసర్వే చేయాలన్నారు. రీసర్వే చేపట్టే ముందు రోజే జాయింట్ భూములున్న ప్రతి రైతుకూ నోటీసులు ఇచ్చి రైతుల సమక్షంలోనే రీసర్వే పనులు చేయాలన్నారు. రైతుకు తెలియకుండా రీసర్వే పనులు చేయరాదన్నారు. రీసర్వేలో సిబ్బంది ఎటువంటి అవకతవకలకు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఐఓఎస్ ప్రసాద్, డీఐఓఎస్ రవిచంద్ర, వీఆర్వోలు నరేంద్ర, శ్రీరాములు, మండల సర్వేయర్ శ్రీవాణి, టీం మెంబర్స్ సురేష్‌రెడ్డి, మధు, వీఆర్‌ఏ సుశీలమ్మ పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- జడ్పీ సీఈవో ఓబులమ్మ



సూర్యనారాయణపురంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జడ్పీ సీఈవో ఓబులమ్మ

రామాపురం/లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కడప జడ్పీ సీఈవో ఓబులమ్మ తెలిపారు. మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సూర్యనారాయణపురంలో గురువారం శుభ్రత, పరిశుభ్రతపై డోర్ టు డోర్ తిరిగి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో గ్రామాల్లో అంటువ్యాధులు రాకుండా ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. గ్రామానికి సంబంధించిన తడి, పొడి చెత్తను వేరుగా గ్రీన్ అంబాసిడర్లకు ఇవ్వాలని మహిళలకు తెలియజేశారు. తడి, పొడి చెత్త అంబాసిడర్లు ప్రజలకు అవగాహన కల్పించేందుకు కమ్యూనిటీ పర్సన్‌తో మాట్లాడి ప్రతిరోజూ 50 ఇళ్లు సందర్శించి తడి చెత్తను, పొడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు ఇచ్చేలా అవగాహన కల్పించాలని ఆమె పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అలాగే సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ప్రోగ్రాం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామానికి సంబంధించిన చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆమె సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జాషువా, పంచాయతీ కార్యదర్శి నాగమణి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై దృష్టి సారించండి

గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ తెలిపారు. గురువారం లక్కిరెడ్డిపల్లె ఎంపీడీవో కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ సెక్రటరీతో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించి గ్రామాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డయ్య, పంచాయతీ సెక్రటరీ, సిబ్బంది పాల్గన్నారు.


ప్రధాని సభకు ముస్లిం మహిళలు


సభకు వేలాది బస్సులు ఇలా...


మోదీతో చంద్రబాబు, పవన్











నమో..జోష్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)


సభలో ఉప్పొంగిన దేశభక్తి


సభలో టీడీపీ మహిళా నేతలు




శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ




పొలాల వెంబడి పరుగులు

మహిళా శక్తి కుటుంబానికి బలమైన పునాది

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీసర్కిల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన మహిళా శక్తి కుటుంబానికి బలమైన పునాది లాంటిదని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. గురువారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం ముగింపు కార్యక్రమాన్ని సుధా కన్వెన్షన్ హాల్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్య, వైద్య శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో సెప్టెంబరు 17 నుంచి ఈనెల 16వ తేదీ వరకు జిల్లాలో కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. గతంలో పార్వతీపురం, మన్యం జిల్లాల్లో తన అనుభవాన్ని పంచుకుంటూ అక్కడ 1000 మంది పిల్లలు పుడితే వారిలో దాదాపు 25 మంది పిల్లలు పౌష్టికాహార లోపం వల్ల పుట్టిన సంవత్సరంలోపు చనిపోయేవారని తెలిపారు. దీనికి రకరకాల కారణాలతో ముఖ్యంగా బరువు తక్కువగా ఉండటం, తల్లి గర్భం దాల్చిన సమయంలో ప్రతిరోజు తీసుకునే ఆహారంలో పౌష్టికాహార లోపం, వారికి 9 నెలల పాటు అందించాల్సిన వైద్య సదుపాయాలు అందకపోవడం తదితర కారణాలే కాకుండా డెలివరీ సమయంలో ప్రతి నెలలో దాదాపు మాతా శిశు మరణాల సంఖ్య కూడా ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. అటువంటి సమస్యలు రాకుండా ప్రతి ఒక్కరూ బలవర్థకమైన ఆహారం తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అంగన్వాడీ కార్యకర్తలకు కలెక్టర్ మెమెంటోలను అందించారు. గర్భిణులకు సీమంతం చేసి వారిని కలెక్టర్ ఆశీర్వదించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ హైమావతి, నగరపాలక సంస్థ కమిషనర్ రవి, ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్ట్ కోటేశ్వరమ్మ, జీసీడీవో మాధవి, అంగన్వాడీ, ఆశావర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.


పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

లేఔట్లను రెగ్యులర్ చేసుకోండి

రైల్వేకోడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అనధికారిక లేఔట్లను రెగ్యులర్ చేసుకోవాలని ఉమ్మడి కడప జిల్లా కుడా ఏపీవో క్రిష్ణాసింగ్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరులో 19, పుల్లంపేటలో 3, పెనగలూరులో 2, చిట్వేలిలో 1 అనధికారిక లేఔట్లు ఉన్నాయని తెలిపారు. వీటిని ఈనెల 24వ తేదీలోపు రెగ్యులర్ చేసుకోకపోతే లేఔట్లలో ఉన్న హద్దురాళ్లను తొలగిస్తామని హెచ్చరించారు. ప్లాట్ల అమ్మకాలు, కొనుగోలుకు వీలు లేకుండా అన్ని సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో నిషేధిత భూముల రిజిష్టరులో నమోదు చేస్తామని తెలిపారు. అలాగే ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగిరెడ్డి, ఈవోపీఆర్డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీవో క్రిష్ణ సింగ్

కలప రవాణాను అడ్డుకున్న అధికారులు

- అధికారులపై తిరగబడిన వ్యాపారులు

గుర్రంకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కలపను లోడ్ చేస్తున్న లారీని గురువారం రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంతో వ్యాపారులు అధికారులపై తిరగబడ్డారు. మండలంలోని వైసీపీకి చెందిన కొందరు కలప వ్యాపారులు రైతుల పొలాలు, ప్రభుత్వ భూముల్లో ఉన్న వృక్షాలను విచ్చలవిడిగా నరికేస్తున్నారు. మార్కెట్ యార్డు సమీపంలోని మామిడితోట, తలారివాండ్లపల్లె, గుండ్లగుట్టతండా, పాలకుంటపల్లె, చెర్లోపల్లె, తరిగొండ ప్రాంతాల్లో కలపను అక్రమంగా డంప్ చేస్తున్నారు. మార్కెట్ యార్డు సమీపంలోని మామిడితోట వద్ద గురువారం అక్రమంగా కలపను లారీకి లోడ్ చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఆర్ఐ సదాశివప్పనాయుడు, సిబ్బంది వెళ్లి కలపను తరలించడానికి అనుమతులున్నాయా అంటూ ప్రశ్నించారు. దీంతో కలప వ్యాపారులు అనుమతులు ఎందుకు చూపించాలంటూ తిరగబడ్డారు. అటవీ శాఖాధికారులు తమకు అనుమతులు ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులను పరిశీలించగా కలప తరలించడానికి వ్యాపారులు దరఖాస్తు చేసుకున్న రికార్డులు మాత్రమే ఉన్నాయి తప్ప అనుమతి లేదు. దీంతో అధికారుల అనుమతి తీసుకున్న తరువాతే కలపను తరలించాలని వ్యాపారులకు సూచించారు. అప్పటి వరకు కలప లారీని బయటకు పంపరాదని వ్యాపారులకు గట్టిగా హెచ్చరించారు.


కలప లారీ రికార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

వరి పంటపై అడవి పందుల దాడి


అడవి పందులు ధ్వంసం చేసిన వరి పంట

సుండుపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వరి పంటపై అడవి పందులు దాడి చేసి రైతులకు నష్టం చేకూర్చినట్లు గురువారం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ పెద్దవీటి చెన్నయ్య, మూడే రెడ్డినాయక్‌లకు చెందిన వరి పంటలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అడవి పందుల బెడద నుంచి పంటలను రక్షించాలని, నష్టపోయిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు. ప్రతి ఏడాది పంటలు సాగు చేసిన సమయంలో అడవి పందుల దాడి నుంచి రైతులకు విముక్తి కల్పించాలని, అటవీ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉత్తమ రైతు అమృనాయక్ డిమాండ్ చేశారు.

అదృశ్యమైన వ్యక్తి శవమయ్యాడు...

మదనపల్లె అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో గత నెలలో అదృశ్యమైన శ్రీకాంత్ (58) మృతదేహం పుంగనూరు మండలం యాతాల వంకలో బయటపడింది. స్థానిక చిత్తూరు బస్టాండ్‌లో గాయత్రి మెడికల్ షాపు నిర్వహిస్తున్న శ్రీకాంత్ గత నెల 27న అదృశ్యమైనట్లు మదనపల్లె వన్‌టౌన్‌లో సీఐ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేశారు.

కాగా చిప్పిలి సమీపంలో హంద్రీ-నీవా కాల్వ గట్టుపై శ్రీకాంత్ చెప్పులు, బైక్ వదిలి కనపడకుండాపోవడంతో కాలువలో పడిపోయాడనుకుని మదనపల్లె అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకుండాపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పట్లో అదృశ్యం కేసు నమోదు చేశారు. కాగా గురువారం పుంగనూరు మండలం యాతాల వంకలో మృతదేహం బయటపడింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు మదనపల్లె వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసినట్లు తెలిపారు.

బాలల భద్రతకు పోలీసుల భరోసా

గుడ్ టచ్- బ్యాడ్ టచ్‌పై శక్తి టీం స్పెషల్ క్లాసులు


చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీం సభ్యులు

రాయచోటిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖ చిన్నారుల భద్రతకు భరోసా ఇస్తోంది. ఇందులో భాగంగానే ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా శక్తి టీం బృందాలు పాఠశాలల్లో బాలల కేంద్రాల్లో గుడ్ టచ్- బ్యాడ్ టచ్ అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బ్యాడ్ టచ్ ఎదురైతే వెంటనే పెద్ద శబ్దంతో నో చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోవాలని చిన్నారులకు చెప్పారు. ఇబ్బందులను దాచకుండా తల్లిదండ్రులు, టీచర్లు, నమ్మకమైన పెద్దలకు మాత్రమే చెప్పాలని సూచించారు. అత్యవసరమైతే 112 (పోలీస్) గానీ 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్)కు గానీ కాల్ చేయాలని అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారి భద్రత మాకు అత్యంత ముఖ్యమని, తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహ పూర్వకంగా ఉండాలని, వారు చెప్పే ప్రతి విషయాన్ని శ్రద్ధగా వినాలన్నారు. పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ పిల్లల రక్షణకు అందుబాటులో ఉంటుందని, భయం లేకుండా పోలీసులకు సమాచారం ఇచ్చి సమాజాన్ని బాలల భద్రతను మరింత పటిష్టంగా మార్చడానికి జిల్లా ప్రజలందరూ సహకరించాలని ఎస్పీ తెలిపారు.

రాష్ట్ర స్థాయికి సంబేపల్లె విద్యార్థులు

రాయచోటి (నేతాజీసర్కిల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం మధ్యాహ్నం వారధి ఫౌండేషన్ వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకర రామకృష్ణ తెలిపారు. డాక్టర్ మోహన్ కందా అధ్యక్షతన నిర్వహించబడుతున్న ప్రభుత్వేతర సంస్థ అయిన వారధి ఫౌండేషన్ వారు ప్రతి సంవత్సరం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర స్థాయి వార్షిక పోటీలను నిర్వహించి నగదు బహుమతి ప్రదానం చేస్తారన్నారు. సంబేపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన తరుణ్‌కుమార్‌గౌడ్, చిలకమ్మ, మౌనిక అను ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

రీసర్వేపై అధికారులతో సమీక్ష

రాయచోటి (నేతాజీసర్కిల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భూసర్వే ప్రాజెక్టులో 3వ ఫేస్‌లో జరగనున్న రీసర్వేపై కొంత మంది డిప్యూటీ డైరెక్టర్లతో గురువారం సమీక్ష నిర్వహించినట్లు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ పీవీ జయరాజ్ తెలిపారు. కార్యక్రమానికి ప్రత్యేక అధికారిగా తనను నియమించినట్లు తెలిపారు.

రీసర్వే గ్రామాలను తనిఖీ చేసి ప్రభుత్వ ఆదేశాలు, సూచనల మేరకు రీసర్వే గుణాత్మక పరిణామాత్మకంగా రీసర్వే నిర్వహించాలని, రైతుల సమక్షంలో రీసర్వే ప్రక్రియ ముగించాలని ఆదేశించారు. రీసర్వేలో ఎదురయ్యే సమస్యలపై సర్వేయర్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌లతో చర్చించి రీసర్వే ప్రామాణిక విధానంలో ఎదురయ్యే పలు ఆధునిక సందేహాలకు పరిష్కారం సూచించారు.

అధికారులు సీజ్ చేశారు.. సిబ్బంది తెరిచారు

- 24 గంటల్లోనే తెరుచుకున్న అశ్విని ఆస్పత్రి

వీలేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ అనుమతులు లేవంటూ వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారులు ఆగమేఘాలపై వచ్చి అట్టహాసంగా అశ్విని ఆస్పత్రిని బుధవారం సీజ్ చేశారు. ఇందులో మతలబేంటో తెలియదు కాని 24 గంటల వ్యవధిలో తిరిగి తెరుచుకుంది. సీజ్ చేసిన ఆస్పత్రిని గురువారం రాత్రి రెవెన్యూ, స్థానిక వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆస్పత్రి నిర్వాహకులైన డాక్టర్ శ్రమంత్ కుమార్ రెడ్డి సమక్షంలో తెరిచారు. దీంతో ఆస్పత్రిని సీజ్ చేసిన 24 గంటల్లోనే తిరిగి ఎందుకు తెరిచారో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

అగ్నిమాపక శాఖ అనుమతులు లేవంటూ ఆస్పత్రిని డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య, డెమో దేవశిరోమణి, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి ప్రసాద్ నాయక్ బుధవారం సీజ్ చేశారు. సీజ్ చేసిన అనంతరం అధికారులపై ఒత్తిళ్లు వచ్చాయో లేక ఆస్పత్రి నిర్వాహకులు అనుమతులు తెచ్చుకున్నారో అన్న విషయంలో అనిశ్చితి నెలకొంది. అయితే తమకు జిల్లా ఉన్నతాధికారుల నుంచి అందిన ఆదేశాల మేరకు ఆస్పత్రిని తిరిగి తెరిచినట్లు స్థానిక సిబ్బంది తెలిపారు. అంతకు మించి తమకు సమాచారం లేదన్నారు.


అశ్విని ఆస్పత్రిని తెరుస్తున్న రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

జలమార్గాల అభివృద్ధి సంస్థ సీఈవోగా మురళీనాథరెడ్డి



మదనపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలమార్గాల అభివృద్ధి సంస్థ అదనపు సీఈవోగా ఆర్.మురళీనాథ్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రభుత్వ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ ఎం.తిరుమల కృష్ణబాబు జీవో జారీ చేశారు. రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి, పెన్నా, తుంగభద్ర నదులు సహా ప్రధాన ప్రాజెక్టుల్లో జలమార్గాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 2023లో ప్రత్యేకంగా చట్టం చేశారు. కాగా ఏడాది కిందట మదనపల్లె హంద్రీ-నీవా సీఈగా ఉద్యోగ విరమణ చెందిన ఈయనను ప్రస్తుత ప్రభుత్వం మొట్టమొదటి సీఈఓగా నియమించింది. ముఖ్యంగా వాటర్ సోర్సు టూరిజం, పోర్టులను అభివృద్ధి చేసే దిశగా అవకాశాలను రూపొందించాలి. వీటిని పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్ (పీపీపీ) విధానంలో అక్కడున్న అవకాశాలను వివరిస్తూ పెట్టుబడులు పెట్టేలా వ్యాపారులను ప్రోత్సహించాలి. తద్వారా ప్రభుత్వానికి సంపద సృష్టించడం, టూరిజాన్ని అభివృద్ధి చేయాల్సి వుంటుంది. హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ, తదితర జలవనరుల ప్రాజెక్టుల్లో పనిచేసిన మురళీనాథరెడ్డి ఏడాది కిందట సీఈగా పదవీ విరమణ పొందారు. టన్నెల్ తవ్వకాలు, ఎత్తిపోతల పథకాల నిర్మాణాల్లో మంచి ప్రావీణ్యం ఉందని గుర్తించిన ప్రభుత్వం ఏడాది కాల వ్యవధితో కాంట్రాక్ట్ బేసిక్‌లో సీఈవోగా అవకాశం కల్పించింది. ఈయన విజయవాడ కేంద్రంగా ఇరిగేషన్, టూరిజం, రెవెన్యూ, రోడ్లు, భవనాలశాఖ, పోర్టులు విభాగాలతో అనుసంధానమై పనిచేయాల్సి ఉంటుంది.

అక్రమాలకు చెక్ దిశగా..

- ఎనిమిదేళ్ల తర్వాత మదనపల్లె సొసైటీ ఎన్నికలు
- ఎన్నికలకు న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్
- రేపు ఓటర్ల జాబితా.. 29న పోలింగ్

మదనపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో 'మదనపల్లె హౌస్ బిల్డింగ్ సొసైటీ' ఎన్నికల వేడి రాజుకుంటోంది. అభ్యంతరాలు, ఆటంకాల మధ్య ఎన్నికల నిర్వహణకు న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సహకార శాఖాధికారులు ప్రక్రియ మొదలు పెట్టారు. ఇందులో భాగంగా కలెక్టర్ ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు ఎన్నికల అధికారిని కూడా నియమించారు. అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ ఎన్నికల జాబితా సిద్ధం చేశారు. మదనపల్లె హౌస్ బిల్డింగ్ సొసైటీకి ఎనిమిదేళ్ల తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో సహకార శాఖాధికారులు వీటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. మరోవైపు అక్రమార్కులకు ఎక్కడికక్కడ చెక్ పెడుతూ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా సన్నాహాలు చేస్తున్నారు.

మదనపల్లె హౌస్‌బిల్డింగ్ సొసైటీ సుమారు 50 ఏళ్ల క్రితం ఏర్పాటైంది. వందలమంది సభ్యులు ఉన్న ఈ సొసైటీకి స్థానిక సొసైటీ కాలనీ, తిరుపతి రోడ్డులోని దేవతానగర్‌కు ఎదురుగా లేఅవుట్‌లు ఉన్నాయి. ఈ క్రమంలో సొసైటీ తరపున ఇప్పటికే కొనుగోలు చేసిన భూమిలో సభ్యులకు ఇక్కడ ప్లాట్లు కేటాయించారు. ఇందులో సొసైటీ కాలనీలో 30 ఏళ్లుగా నివాసాలు ఉండగా, దేవతానగర్ ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో కొందరు నిర్మాణాలు చేపట్టగా అలాట్‌మెంట్ అయినా ఇప్పటికీ మరికొన్ని ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. సొసైటీ ఏర్పడినప్పటి నుంచీ అయిదేళ్ల పదవీ కాలంతో పాలకవర్గాలు ఉండగా, చివరగా 2017 మార్చి నాటికి పాలకవర్గం పదవీకాలం పూర్తయింది. తర్వాత ప్రభుత్వం ఈ సొసైటీకి అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ (పీఐసీ) నియమించింది. ఈ క్రమంలో సొసైటీలో అవినీతి, అక్రమాలు జరిగినట్లు గుర్తించిన అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. తర్వాత వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదు. ఇదిలావుండగా, అంతకుముందే సొసైటీలోని సభ్యుల (ఓటర్ల)ను జాబితా నుంచి తొలగించారని అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి, సహకార శాఖాధికారులపై న్యాయస్థానానికి వెళ్లారు. ఇదే వ్యక్తిపైనే సొసైటీలోని మరో సభ్యుడు కూడా న్యాయస్థానానికి వెళ్లారు. ఈ కేసులపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఎన్నికలు జరపాలని సూచించింది. ఆ మేరకు సహకార శాఖాధికారులు కలెక్టర్‌ను సంప్రదించి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లారు. ఇంతకాలం హౌస్‌బిల్డింగ్ సొసైటీలో జరిగిన అవినీతి, అక్రమాలను అప్పటి ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్తూ, అక్రమార్కుల ప్రయత్నాలను ఎక్కడికక్కడ అడ్డుకుంటూ వచ్చారు. చివరకు న్యాయస్థానంలోని కేసులు ఓ కొలిక్కి రావడంతో తిరిగి ఎన్నికలకు వెళ్తున్నారు. వీటిని కూడా అడ్డుకునేందుకు కొందరు అక్రమార్కులు అడ్డదారులు వెతుకుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

ఇందులో భాగంగా సోమవారం నాటికి క్లయిమ్‌లపై అభ్యంతరాల గడువు ముగిసిపోవడంతో మంగళవారం పీఐసీ, ఎన్నికల అధికారికి ఓటర్ల జాబితా అప్పగించారు. 18వ తేదీ ఓటర్ల తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనున్నారు. 22న నామినేషన్ల స్వీకరణ, 23 నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ, అదేరోజు పోటీలోని అభ్యర్థుల ప్రకటన ఎన్నికల గుర్తుల కేటాయింపు ఉంటుంది. ఒకవేళ అభ్యర్థుల మధ్య పోటీ ఉంటే 29న పోలింగ్, 30వ తేదీ ఎన్నికల కౌంటింగ్, ఫలితాలు వెల్లడించనున్నారు. మొత్తం 239 మందికి ఓటు హక్కు ఉంది.

అక్రమాలు ఎలాగంటే..

సొసైటీలోని సభ్యులకు సొసైటీ తరపున కొనుగోలు చేసిన భూమిలో ప్లాట్లు కేటాయిస్తారు. ఆ సమయంలో సభ్యునికి అలాట్‌మెంట్ (ప్రొసీడింగ్) కాపీ ఇస్తారు. దీని ఆధారంగా తర్వాత నిర్ణీత సమయంలో సభ్యుడు ఆ ప్లాటును రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అయితే సొసైటీ కాలనీలో 30 ఏళ్ల క్రితం జరిగిన అలాట్‌మెంట్‌లో చాలామంది రిజిస్ట్రేషన్లు చేసుకోలేదు. అలాట్‌మెంట్ ఆధారంగా నిర్మాణాలు చేపట్టి కొందరు నివాసం ఉంటుండగా, మరికొందరు బెంగళూరు, చెన్నై, అమెరికా తదితర ప్రాంతాల్లో ఉంటున్నారు. వీరిలో ఇప్పటికే చాలామంది వారి ప్లాట్లను ఇతరులకు అమ్మేయడంతో అపార్ట్‌మెంట్లు, ఆసుపత్రుల నిర్మాణం చేపట్టారు. ప్లాట్లు అమ్మకుండా బయటి ప్రాంతంలో ఉన్న యజమానులు తర్వాత వచ్చి నిర్మాణం చేస్తుంటే అక్రమార్కులు అడ్డుకుంటున్నట్లు చెబుతున్నారు. కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న ప్లాట్లను తిరిగీ ఇతరులకు అలాట్‌మెంట్ పేరుతో అమ్మేస్తూ, సొమ్ము చేసుకుంటున్నట్లు ఆ శాఖాధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. తిరుపతి రోడ్డులోని సొసైటీ లేఅవుట్‌లో ఖాళీగా ఉన్న పాట్లను అంచెలంచెలుగా అయిన వారికి అమ్మేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మదనపల్లెలో కాకుండా బయటి ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. కమ్యూనిటీ అవసరాల కోసం వదిలిన స్థలాలే కాదు.. ఇదివరకే సభ్యులకు కేటాయించిన ప్లాట్లను కూడా అమ్మేస్తున్నారు. బయటి ప్రాంతాల్లో ఉన్న యజమానులు తర్వాత తెలుసుకుని లబోదిబోమంటూ అధికారులను ఆశ్రయిస్తున్నారు. అలాగే బినామీ పేర్లతో కూడా కొన్ని ప్లాట్లు కేటాయించి, తిరిగీ వాటిని ఇతరులకు అమ్మేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో సొసైటీ ఎన్నికలు జరిగితే అక్రమాలన్నింటికీ చెక్ పడుతుందని అందరూ భావిస్తున్నారు.



మదనపల్లెలోని సహకార శాఖ డివిజన్ కార్యాలయం

ధాన్యం ధర.. ధమాల్

- క్వింటాకు రూ.500 తగ్గింపు
- ఆందోళనలో రైతులు

పోరుమామిళ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి.. రేయనక పగలనక కంటికి రెప్పలా పంట పండిస్తే.. తీరా పంట చేతికి వచ్చే సమయానికి ఒక్కసారిగా ధర పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరి సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అసలే వర్షాకాలం కావడంతో పండించిన పంటను అమ్ముకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడిచిందని, నాణ్యత లేదని రకరకాల సాకులు చూపుతూ వ్యాపారులు, దళారులు ఇష్టమొచ్చిన ధరకు అడుగుతున్నారు. అమ్మితే అమ్మండి, లేదంటే ఉంచుకోండంటూ తెగేసి చెబుతున్నారు. దీంతో ధాన్యాన్ని నిల్వ ఉంచుకోలేక.. దళారుల చెప్పిన ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు దాదాపు కొన్ని వందల ఎకరాల్లో వరి పైరు నేలకొరిగి నీట మునిగింది. దీంతో సగానికి పైగా దిగుబడి పడిపోవడంతో దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నారు.

పోరుమామిళ్ల మండలంలో దాదాపు 2వేల ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. పోరు మామిళ్ల, కవలకుంట్ల, బుచ్చంపల్లె, టేకూరుపేట, సిద్దవరం, క్రిష్ణంపల్లె, గానుగపెంట, దమ్మనపల్లె, చల్లగిరిగెల, రంగసముద్రం ప్రాంతాల్లో వరి పైరును రైతన్నలు ఎక్కువగా సాగు చేశారు. ఎకరాకు దాదాపు 30వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. 40 క్వింటాళ్ల దిగు బడి వస్తుందని ఆశించారు. అయితే 20 లేదా 30 క్వింటాళ్ల మాత్రం దిగుబడి రావడంతో రైతులు డీలా పడిపోయారు. ఇక ఇటీవల కురిసిన వర్షానికి మండలంలోని తోకలపల్లె, దమ్మనపల్లె, పోరుమామిళ్ల తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి సగానికి పైగా వరి పైరు నీటిలో మునిగిపోయింది. దీంతో ఎక్కడ మోసులొస్తాయని ఆందోళనతో రైతులు పైరు కోసి అమ్మకాలు మొదలు పెట్టారు. ఇదే అదునుగా వ్యాపారస్తులు, దళారులు వర్షానికి ధాన్యం తడిచిందని, నాణ్యత లేదని సాకులు చెబుతూ ధరలు బాగా తగ్గించారు. గత ఏడాది క్వింటా రూ.2300 ధర పలికితే ఈ ఏడాది రూ.1750 ధర పలుకు తోంది. క్వింటాకు రూ.500 పడిపోవడంతో తీవ్ర నిరాశకు గురవు తున్నారు. దీంతో ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో రైతులు పండించిన పంటను వ్యాపారులు చెప్పిన ధరకే తెగనమ్ముకుంటున్నారు.


అమ్మకానికి రాశిగా పోసిన వరిధాన్యం



నీటిలో మునిగిపోయి నష్టపోయాం

ఇటీవల కురిసిన వర్షానికి వరి పైరు పూర్తిగా నీటిలో మునిగిపోయింది. సగానికి పైగా వరి ధాన్యం నీటిలోనే మునిగిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది ప్రభుత్వం వరి సాగు చేసిన రైతులను ఆదుకోవాలి.

- శ్రీను, దమ్మనపల్లె

అకాల వర్షం నట్టేట ముంచింది



ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు తూము ఎత్తడంతో కాల్వల ద్వారా నీరు పైరులో చేరి మొత్తం మునిగిపోయింది. ధర కూడా లేకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం వరి సాగు చేసిన రైతులను ఆదుకోవాలి.

- గురు శేఖర్, రైతు

డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు దరఖాస్తులు

సీకేదిన్నె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కౌసల్ వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఉపరవాణా కమిషనర్ ఎం.వీ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. నైపుణ్యంతో కూడిన డ్రైవింగ్ స్కిల్స్ అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థికసాయంతో డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడమే దీని ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా 10 లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ చొప్పున మంజూరు చేసేందుకు నిర్ణయించారన్నారు. ఈనెల 23 సాయంత్రం అయిదు గంటల లోపు ఆసక్తిగల అభ్యర్థులు డీపీఆర్ కాపీలను, ఇతర అటాచ్‌మెంట్లను వైఎస్ ఆర్ కడప జిల్లా ఉపరవాణా కార్యాలయంలో ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందుకు కావాల్సిన అర్హతలు ఆసక్తిగల సంస్థ ఎంజీవో, ట్రస్ట్, కోఆపరేటివ్ సొసైటీ, తయారీదారుడు, పార్మ్‌అయి ఉండాలన్నారు. ఎన్జీవో అయితే తప్పనిసరిగా దర్పం పోర్టల్‌లో రిజిస్టర్ అయి ఉండాలన్నారు. ఈ సంస్థ గత మూడు సంవత్సరాల ఆడిట్ రిపోర్ట్స్, టర్నోవర్ సర్టిఫికెట్లు అందించాలన్నారు. ఇటువంటి సంస్థకు సొంతంగా లేదా కనీసం పది సంవత్సరాల లీజు కలిగిన రెండు ఎకరాల స్థలం, సిమ్యులేటర్, ట్రైనింగ్ వాహనాలు, వర్క్‌షాపు, రెండు క్లాస్‌రూమ్స్, ఇంటర్నెట్, తదితర సదుపాయాలు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు రవాణా శాఖ వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

పోరుమామిళ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రంగసముద్రం పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీకి చెందిన ఉదయకిరణ్ (17) అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నెల్లూరు జిల్లాలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం డిప్లమా చదువుతున్న ఉదయ్‌కిరణ్ బుధవారం రాత్రి కళాశాల గదిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. ట్యాబ్ విషయంలో ప్రొఫెసరు మందలించిందని మనస్థాపానికి గురై ఈ ఘటనకు పాల్పడినట్లు సమాచారం. కాగా, ఉదయ్‌కిరణ్ తండ్రి చనిపోవడంతో తల్లి భాగ్యక్ష్మి ఒక్క గానొక్క కుమారుడిని ఎంతో కష్టపడి చదివించేంది. కొడుకు మృతి విషయం తెలిన ఆమె కన్నీటిపర్యంతమైంది.

రేపు కడపలో స్కేటింగ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 18న శనివారం స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ది రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఇజ్రాయెల్ వెల్లడించారు. కాకినాడలో నవంబరు 1వ తేదీ నుంచి 5 వరకు జరగనున్న 37వ అంతర్‌జిల్లాల రోలర్ స్కేటింగ్ పోటీల నేపథ్యంలో క్రీడాకారులను ఎంపిక చేసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18న ఉదయం 6గంటలకు యోగివేమన యూనివర్శిటీ లో రోడ్‌రేస్ పోటీలు ఉంటాయన్నారు. అదేరోజు 9గంటలకు కడప నగర డీఎస్‌ఏ మైదానంలో గల రింక్‌లో ఎంపిక పోటీలు జరగనున్నాయన్నారు. ఇందులో పాల్గొనే బాలబాలికలు ఏజ్ గ్రూపు వివరాలిలా.. 4 నుంచి 6 సంవత్సరాలు, 6 నుంచి 8, 8 నుంచి 10, 10 నుంచి 12, 12 నుంచి 15, 15 నుంచి 18 సంవత్సరాల్లోపు వారు పాల్గొనేందుకు అర్హులన్నారు. జిల్లాలోని ఔత్సాహిక స్కేటింగ్ క్రీడాకారులు తప్పక పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి తద్వారా అంతర్‌జిల్లాల రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక కావాలని కోరారు.

న్యాయం చేయాలని కోరితే నోటీసులా?

- ఆర్డీఓను ప్రశ్నించిన రైతులు


పులివెందుల ఆర్డీఓ కార్యాలయం ఎదుట నోటీసులు అందుకున్న రైతులు

పులివెందుల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా న్యాయం చేయాలని కోరితే నోటీసులు ఇవ్వడం ఏమిటని వేముల మండలం చింతలజూటూరు గ్రామ రైతులు ఆర్డీఓను ప్రశ్నించారు. గురువారం ఆర్డీఓ చిన్నయ్యను రైతులు కలిసి తమ ఆవేదనను వెలిబుచ్చారు. పలువురు రైతులు మాట్లాడుతూ బెంగళూరు టు విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా వేముల మండలం చింతలజూటూరు గ్రామం పరిధిలో పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) ఉందన్నారు. ఆ కెనాల్‌పై అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మిస్తున్నారన్నారు. అయితే బ్రిడ్జి కింద నుంచి పొలాలకు వెళ్లేందుకు వ్యవసాయ యంత్రాలు పోయేందుకు వీలుండదన్నారు. ఈ సమస్య గురించి ఆర్డీఓ చిన్నయ్యను మూడు నెలల కిందట కలిసి వినతిపత్రం సమర్పించామన్నారు. ఆర్డీవో సమస్యకు పరిష్కారం చూపకుండా న్యాయం చేయాలన్న రైతులకే నోటీసులు పంపించారన్నారు. అలాగే డీబీఎల్ కంపెనీ చేస్తున్న అక్రమంగా మట్టి తరలింపు గురించి ఆర్డీఓకు వివరించామన్నారు. ఇందుకు ఆర్డీఓ స్పందిస్తూ కెనాల్ వద్ద జరుగుతున్న పనులను మళ్లీ ఒకసారివచ్చి చూసి పరిష్కరిస్తామని చెప్పారన్నారు. అలాగే మట్టి తరలింపుపై సంబంధిత అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో చింతలజూటూరు, పెద్దజూటూరు, గొల్లలగూడూరు, పెర్నపాడు రైతులు, మద్దతుగా బీజేపీ, టీడీపీ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన జీవనానికి ఫుడ్ టెక్నాలజిస్టులు ప్రయత్నించాలి



ఉత్పత్తులలో కల్తీలు కనుగొనే విధానాన్ని వివరిస్తున్న విద్యార్థినులు

పులివెందుల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మెరుగైన ఆహార ఉత్పత్తులు, పౌష్టికాహారం ద్వారా మెరుగైన జీవితాన్ని అందించడానికి ఫుడ్ టెక్నాలజిస్టులు ప్రయత్నించాలని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధవ సూచించారు. గురువారం ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఆహార ఉత్పత్తుల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. డీన్ మాట్లాడుతూ ప్రస్తుతకాలంలో పోషకాహార లోపం, ఊబకాయం వంటి సమస్యలతో ప్రజలు సతమతమవుతు న్నారన్నారు. ఇలాంటి సమస్యలను అధిగమించడానికి ప్రతి ఒక్కరు రోజూ సమతుల్య ఆహారం తీసుకోవాలని చెప్పారు. బెంగుళూరు గ్లోబల్ గ్రీన్‌కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ చంద్రమోహన్, ప్రొద్దుటూరు శ్రీనిధి డెయిరీ క్వాలిటీ డిపార్ట్‌మెంట్ హెడ్ జె.చంద్రశేఖర్, పులివెందుల వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ లక్ష్మీపతి హాజరై మాట్లాడారు. ఆహార భద్రత, ఆహార పదార్థాలను నిల్వ ఉంచడానికి కొత్తపద్ధతులను కనుగొనాలని, పరిశోధన దృక్పథంతో ఆలోచించాలని విద్యార్థులకు సూచించారు.

అనంతరం నాల్గవ సంవత్సరం విద్యార్థులు తమ ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్ ప్రోగ్రాంలో తయారుచేసిన ఆహార ఉత్పత్తులు ప్రదర్శించారు. మూడవ సంవత్సరం విద్యార్థులు పసుపు, కారం, ఉప్పు, మిరియాలు, కాఫీ పౌడర్, వంట నూనె, పాలు, పెరుగు, పన్నీర్ వంటి ఆహార పదార్థాలలో కల్తీని అతి సులువుగా కనుగొనే పద్ధతులను ప్రదర్శించారు. అలాగే సాహిత్య పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్టూడెంట్ యాక్టివిటీ అధికారి డాక్టర్ కీర్తిరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ జయమ్మ, డాక్టర్ రాజేష్, ఇంజనీర్ నజ్మా, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ జాకీర్ బాష, బి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

బాలవికాస్ హైస్కూల్‌కు జాతీయస్థాయి ర్యాంక్



అవార్డు స్వీకరిస్తున్న బాలవికాస్ స్కూల్ కరస్పాండెంట్ గంగయ్య

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా నిర్వహించిన జాతీయ సర్వేలో కడప బాలవికాస్ హైస్కూల్ విశిష్ట ర్యాంకులు సాధించింది. న్యూఢిల్లీలో జరిగిన అవార్డు కార్యక్రమంలో బడ్జెట్ పాఠశాలల కేటగిరీలో ఈ పాఠశాల జిల్లా స్థాయిలో 2వ, రాష్ట్రస్థాయిలో 5వ, జాతీయస్థాయిలో 26వ ర్యాంకు పొందింది. డైరెక్టర్ గంగయ్య, కరస్పాండెంట్ సుబ్బరాయుడు అవార్డును స్వీకరించి, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి : ఎంపీ

పులివెందుల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడాన్ని ఆపేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పులివెందులలోని వైఎస్సార్ ఆడిటోరియంలో ప్రజావైద్యం ప్రజల హక్కు అంటూ కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ సంతకం పెట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే వైసీపీ గ్రామ, వార్డు కమిటీల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసేందుకు సిద్ధమైందన్నారు. వారికి అనుకూలమైన వారికి కట్టబెట్టేందుకు ఈ విధానాన్ని ముందుకుతెచ్చారన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీతో ప్రజలకు ఎంతో మేలు


ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వీర్రాజు

కడప నాగరాజుపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.వీర్రాజు అన్నారు. గురువారం ఆయన ప్రభుత్వ గెస్ట్ హౌస్ సమీపంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గడంతో వాహనాలపై ఆర్థికభారం తగ్గిందన్నారు. మధ్యతరగతి ప్రజలు వాహనాలు కొనుగోలు చేసేందుకు ఇది మంచి పరిణామమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనంపై రూ.10వేలు, ఆటో రిక్షాపై రూ.20వేలు, గూడ్స్ వాహనాలపై రూ.50వేల వరకు తగ్గింపు వచ్చిందన్నారు. ర్యాలీలో వాహనాల డీలర్లు, రవాణా సంఘాలు, రవాణా కంపెనీల వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ విజయభాస్కర్ ఏఎంవీఐ లక్ష్మీప్రసన్న, రవికుమార్, అసిస్టెంట్ కమిషనర్ నారాయణరెడ్డి, డిప్యూటీ స్టేట్ కమిషనర్ వంశీకృష్ణ, జీఎస్టీఓ మణికంఠ, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య సినిమా యూనిట్ సభ్యులకు సునీల్ యాదవ్ లీగల్ నోటీసులు

- వారం రోజుల్లో సమాధానం చెప్పకుంటే..
- ఒక్కొక్కరిపై రూ.5కోట్లకు పరువునష్టం దావా

పులివెందుల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హత్య సినిమా డైరెక్టర్ శ్రీవిద్య బసవ, ప్రొడ్యూసర్ ఎస్.ప్రశాంత్, వైసీపీ సోషల్ మీడియా వ్యక్తి ఎస్.పవన్‌కుమార్‌లకు మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-2 నిందితుడు సునీల్‌యాదవ్ లీగల్ నోటీసులు పంపించారు. 22 మార్చి 2025న విడుదలైన హత్య సినిమాలో తన తల్లికి సంబంధించిన పాత్ర అసభ్యకరంగా ఉందని సునీల్ యాదవ్ అప్పట్లోనే పేర్కొన్నారు. దీనిపై సోషల్ మీడియాలో పోస్టు చేసిన పవన్‌కుమార్‌పైన, చిత్ర డైరెక్టర్, ప్రొడ్యూసర్లపై పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశారు. దీనిపై అదేరోజు పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే ఈ కేసుకు సంబంధించి వీరు స్టే తెచ్చుకున్నారు. దీనితో ఈ ముగ్గురికి సుప్రీంకోర్టు లాయర్ టీఎల్ నయన్‌కుమార్‌రెడ్డి ద్వారా సునీల్‌యాదవ్ లీగల్ నోటీసు పంపించారు. ఈ నోటీసు బుధవారం వీరికి అందింది. తన తల్లి పాత్రను అసభ్యకరంగా చిత్రీకరించారని, దీనికి ఏడు రోజుల్లో సమాధానం చెప్పాలని నోటీసులో పేర్కొన్నారు. ఏడు రోజుల్లో సమాధానం చెప్పకపోతే ఒక్కొక్కరిపైన రూ.5కోట్లకు పరువునష్టం దావా వేస్తానని అందులో తెలిపారు. దీనిపై గురువారం సునీల్‌యాదవ్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. వారికి నోటీసులు ఇచ్చినట్టు ధ్రువీకరించారు.

మఠాధిపతి ఎంపికను ధార్మిక పరిషత్ నిర్ణయిస్తుంది


మాట్లాడుతున్న బ్రహ్మపథం పీఠాధిపతి క్రిష్ణమాచార్య

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్ర స్వామి మఠానికి సంబంధించి మఠాధిపతి నిర్ణయం ఈనెల 28న ధార్మిక పరిషత్ కమిటీ ద్వారా జరుగుతుందని బ్రహ్మపథం పీఠాధిపతి క్రిష్ణమాచార్య అన్నారు. ఆయన గురువారం బ్రహ్మంగారి మఠంలోని పార్కులో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం చాలాప్రాముఖ్యత చెందిన మఠం అని, ఇప్పటి వరకు 8 తరాలు మారాయని, 11 మంది పీఠాధిపతులు మారారన్నారు. నాలుగు సంవత్సరాల కిందట మఠాధిపతి వెంకటేశ్వరస్వామి శివైక్యం చెందిన తరువాత మఠాధిపతి ఎంపిక విషయం కొన్ని అనివార్య కారణాల వల్ల ఆగింద న్నారు. దీనిపై కొంతమంది పీఠానికి, మఠానికి తేడా తెలియని వ్యక్తులు కూడా మాట్లాడడం బాధాకరమన్నారు. మఠాధి పతి ఎంపిక త్వరలోనే ధార్మిక పరిషత్ నిర్ణయిస్తుందని అన్నారు. 28న జరగ బోయే సమావేశానికి గ్రామ ప్రజలు, పెద్దలు మఠం గురించి తెలిసిన ఆచార సాంప్రదాయాలను ధార్మిక పరిషత్‌కు లిఖితపూర్వకంగా తమ అభిప్రాయాలను అందజేయవచ్చన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటిన కేజీబీవీ విద్యార్థులు


పతకాలు సాధించిన అట్లూరు కేజీబీవీ విద్యార్థులు

అట్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో అట్లూరు కస్తూర్బా గురుకుల కళాశాల, పాఠశాల విద్యార్థులు పాల్గొని వెండి, పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రత్యేక అధికారి ఫణిశ్రీ తెలిపారు. బాక్సింగ్ క్రీడల్లో చైతన్యలక్ష్మి వెండి పతకం సాధించిందన్నారు. అలాగే శిరీషా, హిమశైలజ, వెంకటేశ్వరి, క్రిష్ణకావ్య రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. అలాగే ఉషూ క్రీడల్లోఝాన్సీ, హిమశైలజ. వెండి పతకం సాధించారు. అండర్ -17 ఉషూ క్రీడల్లో తనూజా రజిత పతకం సాధించినట్లు తెలిపారు. వీరిని పీఈటీ ఉపాధ్యాయురాలు ప్రమీల అభినందించారు.

బోనాల కార్యక్రమంలో ప్రసాద్‌బాబు


పూజలు చేస్తున్న ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాలివీడు రోడ్డులో మాండవ్యనది ఒడ్డున మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు నూతనంగా నిర్మించిన ఏటి గంగమ్మ తల్లి ఆలయంలో గురువారం బోనాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు ప్రసాద్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం ప్రారంభించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఏటి గంగమ్మ తల్లికి, పోతురాజు వద్ద బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాబ్‌మేళాలు సద్వినియోగం చేసుకోవాలి

● వైవీయూ డీన్, సీడీసీ, ప్రొఫెసర్ రఘుబాబు

రైల్వేకోడూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్‌మేళా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని వైవీయూ డీన్, సీడీసీ, ప్రొఫెసర్ కె.రఘుబాబు తెలిపారు. గురువారం రైల్వేకోడూరు సాయి డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పెంచలయ్య, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి వెంకటేష్, వివిధ కంపెనీల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఏపీడీ విచారణ

ఓబులవారిపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నరాజుపోడు గ్రామ పంచాయతీకి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న హుస్సేన్‌పై ఏపీడీ మృత్యుంజయరావు, ఎంపీడీవో విజయరావు, ఎంక్వైరీ నిర్వహించారు. చెన్నరాజుపోడు గ్రామ సచివాలయంలో ఎంక్వైరి చేయడం జరిగింది. అనంతరం పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

23న డివిజన్ స్థాయి క్రీడా పోటీలు

రాజంపేటటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజంపేట డివిజన్ పరిధిలోని పాఠశాల విద్యార్థులకు ఈనెల 23 నుంచి 25 వరకు డివిజన్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉప విద్యాధికారి నాగయ్య తెలిపారు. గురువారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాజంపేట మండల విద్యాశాఖాధికారి రఘునాథ్‌రాజు, సుబ్బరాయుడు, పుల్లంపేట మండల విద్యాధికారి చక్రధర్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

● సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శంకర్


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శంకర్

రాయచోటిటౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కడపలో డిసెంబరు 6, 7వ తేదీల్లో జరగనున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శంకర్ అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో రాయలసీమ జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పొలిట్ బ్యూరో సభ్యుడు వి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి డి.బంగార్రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్‌కిరణ్ హాజరై మాట్లాడారు. కార్పొరేట్ మతతత్వ, మనువాద శక్తులను ప్రతిఘటిద్దామని, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం వర్ధిల్లేలా ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామన్నారు. మన రాష్ట్రంలో అభివృద్ధి, సంపద సృష్టి, సంక్షేమం చేస్తామని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన డబల్ ఇంజన్ సర్కారు నేడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని విమర్శించారు. లాభాల్లో నడుస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు తీవ్ర ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, జిల్లా కమిటీ సభ్యులు చెన్నయ్య, రఘునాథ్ నాయుడు, సుజాత, లవకుమార్, చలపతి, సుబ్బమ్మ, జయమ్మ, చిత్తూరు జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్, కడప జిల్లా నాయకులు చంద్రశేఖర్, అనంతపురం జిల్లా కార్యదర్శి వేమన, కర్నూలు జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, రాయలసీమ జిల్లా కమిటీ మెంబర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చంద్రప్రసాద్‌కు పురస్కారం


పురస్కారం అందుకుంటున్న చంద్రప్రసాద్

రామాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపగుడిపల్లె గ్రామానికి చెందిన అక్కుల చంద్రప్రసాద్‌కు కళా, సేవారంగంలో చేసిన సేవలకు గానూ నంది పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ చిక్కడపల్లిలో త్యాగరాయ గాన మహాసభ తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 15న నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రతిభ చూపారు. మండలి బుద్ధప్రసాద్ తండ్రి వెంకటకృష్ణారావు జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నందితో పాటు ప్రశంసాపత్రం, మెడల్ బహూకరించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

శిబ్యాల చెరువులో వదిలిన చేపలు

రాయచోటిటౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శిబ్యాల గ్రామంలో గల చెరువులో గురువారం రాయచోటి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి రైతుల సమక్షంలో లక్ష చేపపిల్లలను వదిలారు. ఆయన మాట్లాడుతూ చేపపిల్లలతో గ్రామ పంచాయతీకి ఆదాయం పెరుగుతుందన్నారు. చేపలను అక్రమార్కుల భారిన పడకుండా గ్రామ పంచాయతీ సిబ్బంది జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మత్తుమందు దినోత్సవం


ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

రాయచోటిటౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం అంతర్జాతీయ మత్తు మందు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ అనస్థీషియా డాక్టర్ వెంకటశివ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, సీనియర్ సివిల్ సర్జన్ డాక్టర్ లక్ష్మిప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి సీఎంవో డాక్టర్ కిరణ్‌కుమార్ అనస్థీషియా డాక్టర్ అనిల్‌కుమార్, వైద్య సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటశివ మాట్లాడుతూ 1837-1901 విక్టోరియన్ కాలంలో ఆపరేషన్ అంటే భరించరాని నొప్పితో బాధపడేవారని, అనంతరం 1846 అక్టోబరు 16న విలియం మోర్టన్ అనే దంత వైద్యుడు బోస్టన్ నగరంలో అనస్థీషియాపై ప్రదర్శన ఏర్పాటు చేశారన్నారు. అందుకు ప్రతియేటా ప్రపంచ అనస్థీషియా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. అనంతరం ప్రపంచ మత్తు మందు దినోత్సవం సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, హెడ్ నర్సు విజయకుమారి, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

సుండుపల్లె, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, నరేంద్రమోదీ సారథ్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తోందని బీజేపీ రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్ తెలిపారు. గురువారం మండలంలోని మడితాడు గ్రామంలో జీఎస్టీ 2.0 సంస్కరణల ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సుధాకర్, రాచారాయుడు, నాగమునెయ్య, సత్యంనాయుడు, గోపాలరాజు, వెంకట్రమణ, సుబ్బరామరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

రైల్వేకోడూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ఆవరణంలో ఆధార్ కేంద్రాన్ని గురువారం ఎంపీడీవో నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, అవసరాన్ని బట్టి అందరికీ అందుబాటులో ఉండేందుకు వీలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు వినతిపత్రం

రైల్వేకోడూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రైల్వేకోడూరు నాయకులు ఆలం రమేష్, జోగినేని మణిలు కోరారు. ఈ మేరకు మంగళగిరి జనసేనపార్టీ కార్యాలయంలో మచిలీపట్నం డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామక్రిష్ణ, లీగల్ సెల్ వేణుగోపాల్, రీజనల్ కో-ఆర్డినేటర్ చల్లా లక్ష్మీలకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడూరు-వెంకటగిరి రోడ్డు, ఆర్టీసీ బస్టాండు నిర్మాణం, కోడూరు పట్టణంలో అండర్ డ్రైనేజి, అనంతరాజుపేట అప్సా జ్యూస్ పరిశ్రమ పునరుద్ధరించాలన్నారు. ఈ వినతిపత్రం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు అందజేసి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని బండి రామక్రిష్ణ తెలిపారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాదినేని కనకరాజు, ఏనుగుల జగన్‌మోహన్ రాయల్, ఆనాల సునీల్‌కుమార్, పసుపులేటి రమణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన సేవలందించడమే లక్ష్యం


బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్, బ్యాంకు అధికారులు

రాజంపేటటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంకు తమ ఖాతాదారుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ దేశంలోనే ఐదో బ్యాంకుగా ఎదిగిందని ఆ సంస్థ జోనల్ హెడ్ పత్రి శ్రీనివాస్ కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని యూనియన్ బ్యాంకు అమ్మవారిశాల శాఖ నూతన బ్రాంచి ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాతాదారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం, ప్రజల సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమంలో తమవంతు బాధ్యతగా సేవలందిస్తున్నామన్నారు. కాగా రాజంపేటలో యూనియన్ బ్యాంకు 600 కోట్లకు పైగా లావాదేవీలు నిర్వహిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బ్యాంకులో అధునాతన లాకర్ సదుపాయం కల్పిస్తున్నామని, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రీజనల్ హెడ్ లక్ష్మీతులసి, బ్యాంకు అధికారులు మొగిలీశ్వర, చీఫ్ ఇంజనీరు వంశీకృష్ణ, ధనుంజయ్య, బ్యాంకు మేనేజర్ అబ్దుల్ లతీఫ్, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

కెరియర్ గైడెన్స్‌పై అవగాహన

పెనగలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులు భవిష్యత్‌లో తమ జీవన విధానం తీసుకుని చదివితే బాగుంటుందో ఏ కార్యక్రమాలు చేపడితే జీవితం సాఫీగా సాగుతుందో అనే విషయాలను తెలియజేస్తూ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 గైడ్‌లు డాక్టర్ సీవో హేమలత గౌస్ మొహిద్దీన్ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-1 సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సహజబ్లెస్సీ పాల్గొన్నారు.

రెండు మండలాలు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక

● జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ

(రాయచోటి/నేతాజీసర్కిల్), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఏడీఏపీటీ4ఆర్ ప్రాజెక్టు కింద లక్కిరెడ్డిపల్లె, చిన్నమండెం మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ తెలియజేశారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఈ పథకంలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా స్థాయి, మండల స్థాయిలో రెండు రోజుల వర్క్‌షాపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రోగ్రాంలో జిల్లా, మండల స్థాయి, ప్రైమరీ సెక్టార్ అధికారుల భాగస్వామ్యంతో వార్షిక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డబ్ల్యుఎఫ్‌పీ ఢిల్లీ టీం సభ్యులు బాలాజీ త్రిపాఠి, సుధేష్ణసేన్, ఆర్‌కే జ్యోతి పత్ర, ఆర్‌వైఎస్ఎస్ కార్యాలయం నుంచి ఎన్‌వై శాస్త్రి, సౌమ్య కొల్లా, డీపీఎం వెంకటమోహన్, డబ్ల్యుఎఫ్‌పీ ఎస్‌పీఎం డాక్టర్ వీఈ నరసింహారెడ్డి, చందన సమన్వయంతో నిర్వహించారు.

రెండు రోజుల శిక్షణా తరగతులు : ఎంపీడీవో

రాయచోటిటౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 17, 18వ తేదీల్లో రాయచోటి మండల పరిధిలోని సర్పంచులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలకు రెండు రోజుల పాటు ఓఎస్ఆర్‌పై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి గ్రామ పంచాయతీ సర్పంచులతో పాటు పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీ సెక్రటరీలు తప్పనిసరిగా హాజరుకావాలని తెలియజేశారు.

రైతు శ్రేయస్సు కోసమే కిసాన్ స్మార్ట్ : ముక్కా వరలక్ష్మి

ఓబులవారిపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం ద్వారా రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కిసాన్ స్మార్ట్ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ ఏదోటి వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని గద్దలరేవుపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని టీడీపీ మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మీ చేతులమీదుగా గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హేమనవర్మ, సూరపరాజు శ్రీధర్‌రాజు, రామరాజు, గుత్తి నరసింహా, వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రమణ్యం, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ఎగ్జిబిషన్

రాయచోటి (నేతాజీసర్కిల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయచోటి జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో జీఎస్టీ తగ్గింపుపై ఈనెల 17 నుంచి మూడు రోజుల పాటు ఎగ్జిబిషన్ స్టాల్, ఫుడ్ కోర్టు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై ఈనెల 17, 18, 19వ తేదీల్లో ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ స్టాల్స్, ఫుడ్ కోర్టు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


ప్రధాని సభకు ముస్లిం మహిళలు


సభకు వేలాది బస్సులు ఇలా...


మోదీతో చంద్రబాబు, పవన్









నమో..జోష్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)


సభలో ఉప్పొంగిన దేశభక్తి


శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ


సభలో టీడీపీ మహిళా నేతలు






పొలాల వెంబడి పరుగులు

మహిళా శక్తి కుటుంబానికి బలమైన పునాది

● కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీసర్కిల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన మహిళా శక్తి కుటుంబానికి బలమైన పునాది లాంటిదని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. గురువారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం ముగింపు కార్యక్రమాన్ని సుధా కన్వెన్షన్ హాల్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్య, వైద్య శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో సెప్టెంబరు 17 నుంచి ఈనెల 16వ తేదీ వరకు జిల్లాలో కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. గతంలో పార్వతీపురం, మన్యం జిల్లాల్లో తన అనుభవాన్ని పంచుకుంటూ అక్కడ 1000 మంది పిల్లలు పుడితే వారిలో దాదాపు 25 మంది పిల్లలు పౌష్టికాహార లోపం వల్ల పుట్టిన సంవత్సరంలోపు చనిపోయేవారని తెలిపారు. దీనికి రకరకాల కారణాలతో ముఖ్యంగా బరువు తక్కువగా ఉండటం, తల్లి గర్భం దాల్చిన సమయంలో ప్రతిరోజు తీసుకునే ఆహారంలో పౌష్టికాహార లోపం, వారికి 9 నెలల పాటు అందించాల్సిన వైద్య సదుపాయాలు అందకపోవడం తదితర కారణాలే కాకుండా డెలివరీ సమయంలో ప్రతి నెలలో దాదాపు మాతా శిశు మరణాల సంఖ్య కూడా ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. అటువంటి సమస్యలు రాకుండా ప్రతి ఒక్కరూ బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అంగన్వాడీ కార్యకర్తలకు కలెక్టర్ మెమెంటోలను అందించారు. గర్భిణులకు సీమంతం చేసి వారిని కలెక్టర్ ఆశీర్వదించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ హైమావతి, నగరపాలక సంస్థ కమిషనర్ రవి, ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్ట్ కోటేశ్వరమ్మ, జీసీడీవో మాధవి, అంగన్వాడీ, ఆశావర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.


పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

లేఔట్లను రెగ్యులర్ చేసుకోండి

రైల్వేకోడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అనధికారిక లేఔట్లను రెగ్యులర్ చేసుకోవాలని ఉమ్మడి కడప జిల్లా కుడా ఏపీవో క్రిష్ణాసింగ్ తెలిపారు. గురువారం రైల్వే కోడూరు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరులో 19, పుల్లంపేటలో 3, పెనగలూరులో 2, చిట్వేలిలో 1 అనధికారిక లేఔట్లు ఉన్నాయని తెలిపారు. వీటిని ఈనెల 24వ తేదీలోపు రెగ్యులర్ చేసుకోకపోతే లేఔట్లలో ఉన్న హద్దురాళ్లను తొలగిస్తామని హెచ్చరించారు. ప్లాట్ల అమ్మకాలు, కొనుగోలుకు వీలు లేకుండా అన్ని సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో నిషేధిత భూముల రిజిష్టరులో నమోదు చేస్తామని తెలిపారు. అలాగే ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగిరెడ్డి, ఈవోపీఆర్‌డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీవో క్రిష్ణ సింగ్

కలప రవాణాను అడ్డుకున్న అధికారులు

● అధికారులపై తిరగబడిన వ్యాపారులు

గుర్రంకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కలపను లోడ్ చేస్తున్న లారీని గురువారం రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంతో వ్యాపారులు అధికారులపై తిరగబడ్డారు. మండలంలోని వైసీపీకి చెందిన కొందరు కలప వ్యాపారులు రైతుల పొలాలు, ప్రభుత్వ భూముల్లో ఉన్న వృక్షాలను విచ్చలవిడిగా నరికేస్తున్నారు. మార్కెట్ యార్డు సమీపంలోని మామిడితోట, తలారివాండ్లపల్లె, గుండ్లగుట్టతండా, పాలకుంటపల్లె, చెర్లోపల్లె, తరిగొండ ప్రాంతాల్లో కలపను అక్రమంగా డంప్ చేస్తున్నారు. మార్కెట్ యార్డు సమీపంలోని మామిడితోట వద్ద గురువారం అక్రమంగా కలపను లారీకి లోడ్ చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఆర్ఐ సదాశివప్పనాయుడు, సిబ్బంది వెళ్లి కలపను తరలించడానికి అనుమతులున్నాయా అంటూ ప్రశ్నించారు. దీంతో కలప వ్యాపారులు అనుమతులు ఎందుకు చూపించాలంటూ తిరగబడ్డారు. అటవీ శాఖాధికారులు తమకు అనుమతులు ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులను పరిశీలించగా కలప తరలించడానికి వ్యాపారులు దరఖాస్తు చేసుకున్న రికార్డులు మాత్రమే ఉన్నాయి తప్ప అనుమతి లేదు. దీంతో అధికారుల అనుమతి తీసుకున్న తరువాతే కలపను తరలించాలని వ్యాపారులకు సూచించారు. అప్పటి వరకు కలప లారీని బయటకు పంపరాదని వ్యాపారులకు గట్టిగా హెచ్చరించారు.


కలప లారీ రికార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

వరి పంటపై అడవి పందుల దాడి


అడవి పందులు ధ్వంసం చేసిన వరి పంట

సుండుపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వరి పంటపై అడవి పందులు దాడి చేసి రైతులకు నష్టం చేకూర్చినట్లు గురువారం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ పెద్దవీటి చెన్నయ్య, మూడే రెడ్డినాయక్‌లకు చెందిన వరి పంటలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అడవి పందుల బెడద నుంచి పంటలను రక్షించాలని, నష్టపోయిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు. ప్రతి ఏడాది పంటలు సాగు చేసిన సమయంలో అడవి పందుల దాడి నుంచి రైతులకు విముక్తి కల్పించాలని, అటవీ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉత్తమ రైతు అమ్మనాయక్ డిమాండ్ చేశారు.

అదృశ్యమైన వ్యక్తి శవమయ్యాడు...

మదనపల్లె అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో గత నెలలో అదృశ్యమైన శ్రీకాంత్ (58) మృతదేహం పుంగనూరు మండలం యాతాల వంకలో బయటపడింది. స్థానిక చిత్తూరు బస్టాండ్‌లో గాయత్రి మెడికల్ షాపు నిర్వహిస్తున్న శ్రీకాంత్ గత నెల 27న అదృశ్యమైనట్లు మదనపల్లె వన్‌టౌన్‌లో సీఐ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేశారు.

కాగా చిప్పిలి సమీపంలో హంద్రీ-నీవా కాల్వ గట్టుపై శ్రీకాంత్ చెప్పులు, బైక్ వదిలి కనపడకుండాపోవడంతో కాలువలో పడిపోయాడనుకుని మదనపల్లె అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకుండాపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పట్లో అదృశ్యం కేసు నమోదు చేశారు. కాగా గురువారం పుంగనూరు మండలం యాతాల వంకలో మృతదేహం బయటపడింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు మదనపల్లె వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసినట్లు తెలిపారు.

బాలల భద్రతకు పోలీసుల భరోసా

గుడ్ టచ్- బ్యాడ్ టచ్‌పై శక్తి టీం స్పెషల్ క్లాసులు


చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీం సభ్యులు

రాయచోటిటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖ చిన్నారుల భద్రతకు భరోసా ఇస్తోంది. ఇందులో భాగంగానే ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా శక్తి టీం బృందాలు పాఠశాలల్లో బాలల కేంద్రాల్లో గుడ్ టచ్- బ్యాడ్ టచ్ అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బ్యాడ్ టచ్ ఎదురైతే వెంటనే పెద్ద శబ్దంతో నో చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోవాలని చిన్నారులకు చెప్పారు. ఇబ్బందులను దాచకుండా తల్లిదండ్రులు, టీచర్లు, నమ్మకమైన పెద్దలకు మాత్రమే చెప్పాలని సూచించారు. అత్యవసరమైతే 112 (పోలీస్) గానీ 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్)కు గానీ కాల్ చేయాలని అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారి భద్రత మాకు అత్యంత ముఖ్యమని, తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహ పూర్వకంగా ఉండాలని, వారు చెప్పే ప్రతి విషయాన్ని శ్రద్ధగా వినాలన్నారు. పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ పిల్లల రక్షణకు అందుబాటులో ఉంటుందని, భయం లేకుండా పోలీసులకు సమాచారం ఇచ్చి సమాజాన్ని బాలల భద్రతను మరింత పటిష్టంగా మార్చడానికి జిల్లా ప్రజలందరూ సహకరించాలని ఎస్పీ తెలిపారు.

రాష్ట్ర స్థాయికి సంబేపల్లె విద్యార్థులు

రాయచోటి (నేతాజీసర్కిల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం మధ్యాహ్నం వారాధి ఫౌండేషన్ వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకర రామకృష్ణ తెలిపారు. డాక్టర్ మోహన్ కందా అధ్యక్షతన నిర్వహించబడుతున్న ప్రభుత్వేతర సంస్థ అయిన వారాధి ఫౌండేషన్ వారు ప్రతి సంవత్సరం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర స్థాయి వార్షిక పోటీలను నిర్వహించి నగదు బహుమతి ప్రదానం చేస్తారన్నారు. సంబేపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన తరుణ్‌కుమార్‌గౌడ్, చిలకమ్మ, మౌనిక అను ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

రీసర్వేపై అధికారులతో సమీక్ష

రాయచోటి (నేతాజీసర్కిల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భూసర్వే ప్రాజెక్టులో 3వ ఫేస్‌లో జరగనున్న రీసర్వేపై కొంత మంది డిప్యూటీ డైరెక్టర్లతో గురువారం సమీక్ష నిర్వహించినట్లు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ పీవీ జయరాజ్ తెలిపారు. కార్యక్రమానికి ప్రత్యేక అధికారిగా తనను నియమించినట్లు తెలిపారు.

రీసర్వే గ్రామాలను తనిఖీ చేసి ప్రభుత్వ ఆదేశాలు, సూచనల మేరకు రీసర్వే గుణాత్మక పరిణామాత్మకంగా రీసర్వే నిర్వహించాలని, రైతుల సమక్షంలో రీసర్వే ప్రక్రియ ముగించాలని ఆదేశించారు. రీసర్వేలో ఎదురయ్యే సమస్యలపై సర్వేయర్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌లతో చర్చించి రీసర్వే ప్రామాణిక విధానంలో ఎదురయ్యే పలు ఆధునిక సందేహాలకు పరిష్కారం సూచించారు.

అధికారులు సీజ్ చేశారు.. సిబ్బంది తెరిచారు

● 24 గంటల్లోనే తెరుచుకున్న అశ్విని ఆస్పత్రి

పీలేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ అనుమతులు లేవంటూ వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారులు ఆగమేఘాలపై వచ్చి అట్టహాసంగా అశ్విని ఆస్పత్రిని బుధవారం సీజ్ చేశారు. ఇందులో మతలబేంటో తెలియదు కాని 24 గంటల వ్యవధిలో తిరిగి తెరుచుకుంది. సీజ్ చేసిన ఆస్పత్రిని గురువారం రాత్రి రెవెన్యూ, స్థానిక వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆస్పత్రి నిర్వాహకులైన డాక్టర్ శ్రమంత్ కుమార్ రెడ్డి సమక్షంలో తెరిచారు. దీంతో ఆస్పత్రిని సీజ్ చేసిన 24 గంటల్లోనే తిరిగి ఎందుకు తెరిచారో అర్థం కాని పరిస్థితి నెలకొంది.


అశ్విని ఆస్పత్రిని తెరుస్తున్న రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

అగ్నిమాపక శాఖ అనుమతులు లేవంటూ ఆస్పత్రిని డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య, డెమో దేవశిరోమణి, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి ప్రసాద్ నాయక్ బుధవారం సీజ్ చేశారు. సీజ్ చేసిన అనంతరం అధికారులపై ఒత్తిళ్లు వచ్చాయో లేక ఆస్పత్రి నిర్వాహకులు అనుమతులు తెచ్చుకున్నారో అన్న విషయంలో అనిశ్చితి నెలకొంది. అయితే తమకు జిల్లా ఉన్నతాధికారుల నుంచి అందిన ఆదేశాల మేరకు ఆస్పత్రిని తిరిగి తెరిచినట్లు స్థానిక సిబ్బంది తెలిపారు. అంతకు మించి తమకు సమాచారం లేదన్నారు.

జలమార్గాల అభివృద్ధి సంస్థ సీఈవోగా మురళీనాథరెడ్డి



మదనపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలమార్గాల అభివృద్ధి సంస్థ అదనపు సీఈవోగా ఆర్.మురళీనాథ్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రభుత్వ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ ఎం.తిరుమల కృష్ణబాబు జీవో జారీ చేశారు. రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి, పెన్నా, తుంగభద్ర నదులు సహా ప్రధాన ప్రాజెక్టుల్లో జలమార్గాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 2023లో ప్రత్యేకంగా చట్టం చేశారు. కాగా ఏడాది కిందట మదనపల్లె హంద్రీ-నీవా సీఈగా ఉద్యోగ విరమణ చెందిన ఈయనను ప్రస్తుత ప్రభుత్వం మొట్టమొదటి సీఈఓగా నియమించింది. ముఖ్యంగా వాటర్ సోర్సు టూరిజం, పోర్టులను అభివృద్ధి చేసే దిశగా అవకాశాలను రూపొందించాలి. వీటిని పబ్లిక్ ప్రైవేటు పార్టనర్ షిప్ (పీపీపీ) విధానంలో అక్కడున్న అవకాశాలను వివరిస్తూ పెట్టుబడులు పెట్టేలా వ్యాపారులను ప్రోత్సహించాలి. తద్వారా ప్రభుత్వానికి సంపద సృష్టించడం, టూరిజాన్ని అభివృద్ధి చేయాల్సి వుంటుంది. హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ, తదితర జలవనరుల ప్రాజెక్టుల్లో పనిచేసిన మురళీనాథరెడ్డి ఏడాది కిందట సీఈగా పదవీ విరమణ పొందారు. టన్నెల్ తవ్వకాలు, ఎత్తిపోతల పథకాల నిర్మాణాల్లో మంచి ప్రావీణ్యం ఉందని గుర్తించిన ప్రభుత్వం ఏడాది కాల వ్యవధితో కాంట్రాక్ట్ బేసిక్‌లో సీఈవోగా అవకాశం కల్పించింది. ఈయన విజయవాడ కేంద్రంగా ఇరిగేషన్, టూరిజం, రెవెన్యూ, రోడ్లు, భవనాలశాఖ, పోర్టులు విభాగాలతో అనుసంధానమై పనిచేయాల్సి ఉంటుంది.

అక్రమాలకు చెక్ దిశగా...

● ఎనిమిదేళ్ల తర్వాత మదనపల్లె సొసైటీ ఎన్నికలు

● ఎన్నికలకు న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్

● రేపు ఓటర్ల జాబితా.. 29న పోలింగ్

మదనపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో 'మదనపల్లె హౌస్ బిల్డింగ్ సొసైటీ' ఎన్నికల వేడి రాజుకుంటోంది. అభ్యంతరాలు, ఆటంకాల మధ్య ఎన్నికల నిర్వహణకు న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సహకార శాఖాధికారులు ప్రక్రియ మొదలు పెట్టారు. ఇందులో భాగంగా కలెక్టర్ ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు ఎన్నికల అధికారిని కూడా నియమించారు. అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ ఎన్నికల జాబితా సిద్ధం చేశారు. మదనపల్లె హౌస్ బిల్డింగ్ సొసైటీకి ఎనిమిదేళ్ల తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో సహకార శాఖాధికారులు వీటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. మరోవైపు అక్రమార్కులకు ఎక్కడికక్కడ చెక్ పెడుతూ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా సన్నాహాలు చేస్తున్నారు.

మదనపల్లె హౌస్‌బిల్డింగ్ సొసైటీ సుమారు 50 ఏళ్ల క్రితం ఏర్పాటైంది. వందలమంది సభ్యులు ఉన్న ఈ సొసైటీకి స్థానిక సొసైటీ కాలనీ, తిరుపతి రోడ్డులోని దేవతానగర్‌కు ఎదురుగా లేఅవుట్‌లు ఉన్నాయి. ఈ క్రమంలో సొసైటీ తరఫున ఇప్పటికే కొనుగోలు చేసిన భూమిలో సభ్యులకు ఇక్కడ ప్లాట్లు కేటాయించారు. ఇందులో సొసైటీ కాలనీలో 30 ఏళ్లుగా నివాసాలు ఉండగా, దేవతానగర్ ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో కొందరు నిర్మాణాలు చేపట్టగా అలాట్‌మెంట్ అయినా ఇప్పటికీ మరికొన్ని ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. సొసైటీ ఏర్పడినప్పటి నుంచీ అయిదేళ్ల పదవీ కాలంతో పాలకవర్గాలు ఉండగా, చివరగా 2017 మార్చి నాటికి పాలకవర్గం పదవీకాలం పూర్తయింది. తర్వాత ప్రభుత్వం ఈ సొసైటీకి అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ (పీఐసీ) నియమించింది. ఈ క్రమంలో సొసైటీలో అవినీతి, అక్రమాలు జరిగినట్లు గుర్తించిన అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. తర్వాత వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదు. ఇదిలావుండగా, అంతకుముందే సొసైటీలోని సభ్యుల (ఓటర్ల)ను జాబితా నుంచి తొలగించారని అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి, సహకార శాఖాధికారులపై న్యాయస్థానానికి వెళ్లారు. ఇదే వ్యక్తిపైనే సొసైటీలోని మరో సభ్యుడు కూడా న్యాయస్థానానికి వెళ్లారు. ఈ కేసులపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఎన్నికలు జరపాలని సూచించింది. ఆ మేరకు సహకార శాఖాధికారులు కలెక్టర్‌ను సంప్రదించి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లారు. ఇంతకాలం హౌస్‌బిల్డింగ్ సొసైటీలో జరిగిన అవినీతి, అక్రమాలను అప్పటి ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్తూ, అక్రమార్కుల ప్రయత్నాలను ఎక్కడికక్కడ అడ్డుకుంటూ వచ్చారు. చివరకు న్యాయస్థానంలోని కేసులు ఓ కొలిక్కి రావడంతో తిరిగి ఎన్నికలకు వెళ్తున్నారు. వీటిని కూడా అడ్డుకునేందుకు కొందరు అక్రమార్కులు అడ్డదారులు వెతుకుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

ఇందులో భాగంగా సోమవారం నాటికి క్లయిమ్‌లపై అభ్యంతరాల గడువు ముగిసిపోవడంతో మంగళవారం పీఐసీ, ఎన్నికల అధికారికి ఓటర్ల జాబితా అప్పగించారు. 18వ తేదీ ఓటర్ల తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనున్నారు. 22న నామినేషన్ల స్వీకరణ, 23 నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ, అదేరోజు పోటీలోని అభ్యర్థుల ప్రకటన ఎన్నికల గుర్తుల కేటాయింపు ఉంటుంది. ఒకవేళ అభ్యర్థుల మధ్య పోటీ ఉంటే 29న పోలింగ్, 30వ తేదీ ఎన్నికల కౌంటింగ్, ఫలితాలు వెల్లడించనున్నారు. మొత్తం 239 మందికి ఓటు హక్కు ఉంది.

అక్రమాలు ఎలాగంటే..

సొసైటీలోని సభ్యులకు సొసైటీ తరఫున కొనుగోలు చేసిన భూమిలో ప్లాట్లు కేటాయిస్తారు. ఆ సమయంలో సభ్యునికి అలాట్‌మెంట్ (ప్రొసీడింగ్) కాపీ ఇస్తారు. దీని ఆధారంగా తర్వాత నిర్ణీత సమయంలో సభ్యుడు ఆ ప్లాటును రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అయితే సొసైటీ కాలనీలో 30 ఏళ్ల క్రితం జరిగిన అలాట్‌మెంట్‌లో చాలామంది రిజిస్ట్రేషన్లు చేసుకోలేదు. అలాట్‌మెంట్ ఆధారంగా నిర్మాణాలు చేపట్టి కొందరు నివాసం ఉంటుండగా, మరికొందరు బెంగళూరు, చెన్నై, అమెరికా తదితర ప్రాంతాల్లో ఉంటున్నారు. వీరిలో ఇప్పటికే చాలామంది వారి ప్లాట్లను ఇతరులకు అమ్మేయడంతో అపార్ట్‌మెంట్లు, ఆసుపత్రుల నిర్మాణం చేపట్టారు. ప్లాట్లు అమ్మకుండా బయటి ప్రాంతంలో ఉన్న యజమానులు తర్వాత వచ్చి నిర్మాణం చేస్తుంటే అక్రమార్కులు అడ్డుకుంటున్నట్లు చెబుతున్నారు. కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న ప్లాట్లను తిరిగీ ఇతరులకు అలాట్‌మెంట్ పేరుతో అమ్మేస్తూ, సొమ్ము చేసుకుంటున్నట్లు ఆ శాఖాధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. తిరుపతి రోడ్డులోని సొసైటీ లేఅవుట్‌లో ఖాళీగా ఉన్న పాట్లను అంచెలంచెలుగా అయిన వారికి అమ్మేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మదనపల్లెలో కాకుండా బయటి ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. కమ్యూనిటీ అవసరాల కోసం వదిలిన స్థలాలే కాదు.. ఇదివరకే సభ్యులకు కేటాయించిన ప్లాట్లను కూడా అమ్మేస్తున్నారు. బయటి ప్రాంతాల్లో ఉన్న యజమానులు తర్వాత తెలుసుకుని లబోదిమంటూ అధికారులను ఆశ్రయిస్తున్నారు. అలాగే బినామీ పేర్లతో కూడా కొన్ని ప్లాట్లు కేటాయించి, తిరిగీ వాటిని ఇతరులకు అమ్మేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో సొసైటీ ఎన్నికలు జరిగితే అక్రమాలన్నింటికీ చెక్ పడుతుందని అందరూ భావిస్తున్నారు.



మదనపల్లెలోని సహకార శాఖ డివిజన్ కార్యాలయం

ధాన్యం ధర.. ధమాల్

● క్వింటాకు రూ.500 తగ్గింపు

● ఆందోళనలో రైతులు

పోరుమామిళ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి రేయనక పగలనక కంటికి రెప్పలా పంట పండిస్తే.. తీరా పంట చేతికి వచ్చే సమయానికి ఒక్కసారిగా ధర పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరి సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అసలే వర్షాకాలం కావడంతో పండించిన పంటను అమ్ముకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడిచిందని, నాణ్యత లేదని రకరకాల సాకు చూపుతూ వ్యాపారులు, దళారులు ఇష్టమొచ్చిన ధరకు అడుగుతున్నారు. అమ్మితే అమ్మండి, లేదంటే ఉంచుకోండంటూ చెబుతున్నారు. దీంతో ధాన్యాన్ని నిల్వ ఉంచుకోలేక.. వాళ్లు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు దాదాపు కొన్ని వందల ఎకరాల్లో వరి పైరు నేలకొరిగి నీట మునిగింది. దీంతో సగానికి పైగా దిగుబడి పడిపోవడంతో దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నారు.

పోరుమామిళ్ల మండలంలో దాదాపు 2వేల ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. పోరు మామిళ్ల, కవలకుంట్ల, బుచ్చంపల్లె, టేకూరుపేట, సిద్దవరం, క్రిష్ణంపల్లె, గానుగపెంట, దమ్మనపల్లె, చల్లగిరిగెల, రంగసముద్రం ప్రాంతాల్లో వరి పైరును రైతన్నలు ఎక్కువగా సాగు చేశారు. ఎకరాకు దాదాపు 30వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. 40 క్వింటాళ్ల దిగు బడి వస్తుందని ఆశించారు. అయితే 20 లేదా 30 క్వింటాళ్ల మాత్రం దిగుబడి రావడంతో రైతులు డీలా పడిపోయారు. ఇక ఇటీవల కురిసిన వర్షానికి మండలంలోని తోకలపల్లె, దమ్మనపల్లె, పోరుమామిళ్ల తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి సగానికి పైగా వరి పైరు నీటిలో మునిగిపోయింది. దీంతో ఎక్కడ మోసులొస్తాయని ఆందోళనతో రైతులు పైరు కోసి అమ్మకాలు మొదలు పెట్టారు. ఇదే అదునుగా వ్యాపారస్తులు, దళారులు వర్షానికి ధాన్యం తడిచిందని, నాణ్యత లేదని సాకులు చెబుతూ ధరలు బాగా తగ్గించారు. గత ఏడాది క్వింటా రూ.2300 ధర పలికితే ఈ ఏడాది రూ.1750 ధర పలుకు తోంది. క్వింటాకు రూ.500 పడిపోవడంతో తీవ్ర నిరాశకు గురవు తున్నారు. దీంతో ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో రైతులు పండించిన పంటను వ్యాపారులు చెప్పిన ధరకే తెగనమ్ముకుంటున్నారు.



అమ్మకానికి రాశిగా పోసిన వరిధాన్యం



తడిసిన వరి పైరు చూసి ఆవేదనలో శ్రీనివాసులు

నీటిలో మునిగిపోయి నష్టపోయాం

ఇటీవల కురిసిన వర్షానికి వరి పైరు పూర్తిగా నీటిలో మునిగిపోయింది. సగానికి పైగా వరి ధాన్యం నీటిలోనే మునిగిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది ప్రభుత్వం వరి సాగు చేసిన రైతులను ఆదుకోవాలి.

- శ్రీను, దమ్మనపల్లె

అకాల వర్షం నట్టేట ముంచింది



ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు తూము ఎత్తడంతో కాల్వల ద్వారా నీరు పైరులో చేరి మొత్తం మునిగిపోయింది. ధర కూడా లేకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం వరి సాగు చేసిన రైతులను ఆదుకోవాలి.

- గురు శేఖర్, రైతు

డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు 23 లోపు దరఖాస్తులు

సీకేదిన్నె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కౌసల్ వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు ఈనెల 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఉపరవాణా కమిషనర్ ఎం.వీరాజు ఒక ప్రకటనలో తెలిపారు. నైపుణ్యంతో కూడిన డ్రైవింగ్ స్కిల్స్ అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థికసాయంతో డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడమే దీని ఉద్దేశమన్నారు. 10 లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ చొప్పున మంజూరు చేసేందుకు నిర్ణయించారన్నారు. ఈనెల 23 సాయంత్రం ఐదు గంటలలోపు ఆసక్తిగల అభ్యర్థులు డీపీఆర్ కాపీలను, ఇతర అటాచ్‌మెంట్లను వైఎస్ఆర్ కడప జిల్లా ఉపరవాణా కార్యాలయంలో ఇవ్వాల్సి ఉందన్నారు. ఆసక్తిగల సంస్థ ఎంజీఓ, ట్రస్ట్, కోఆపరేటివ్ సొసైటీ, తయారీదారుడు, ఫార్మ్‌అయి ఉండాలన్నారు. ఎన్జీవో అయితే తప్పనిసరిగా దర్పం పోర్టల్‌లో రిజిస్టర్ అయి ఉండాలన్నారు. ఈ సంస్థ మూడేళ్ల ఆడిట్ రిపోర్ట్స్, టర్నోవర్ సర్టిఫికెట్లు అందించాలన్నారు. ఇటువంటి సంస్థకు సొంతంగా లేదా కనీసం పదేళ్ల లీజు కలిగిన రెండెకరాల స్థలం, సిమ్యులేటర్, ట్రైనింగ్ వాహనాలు, వర్క్‌షాపు, రెండు క్లాస్‌రూమ్స్, ఇంటర్నెట్, తదితర సదుపాయాలు ఉండాలన్నారు. వివరాలకు రవాణా శాఖ వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు.

నెట్‌బాల్ పోటీలకు మంచూరు బాలికలు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినులు

వాల్మీకిపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అండర్-19 రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు కొత్త మంచూరు జడ్పీ హైస్కూల్ బాలికలు ఎంపికయ్యారు. బుధవారం పీటీఎం జడ్పీ హైస్కూల్ ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి నెట్ బాల్ పోటీల్లో మంచూరు పాఠశాలకు చెందిన అపర్ణ, అలేఖ్య, గాయత్రి విశేష ప్రతిభ కనబరచి ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపికైన వీరు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రెడ్డివరప్రసాద్ తెలిపారు. పాఠశాల హెచ్ఎం ప్రకాష్, ఉపాధ్యాయులు బాలికలను అభినందించారు.

రేపు కడపలో స్కేటింగ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 18న శనివారం స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ది రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఇజ్రాయెల్ వెల్లడించారు. కాకినాడలో నవంబరు 1వ తేదీ నుంచి 5 వరకు జరగనున్న 37వ అంతర్‌జిల్లాల రోలర్ స్కేటింగ్ పోటీల నేపథ్యంలో క్రీడాకారులను ఎంపిక చేసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18న ఉదయం 6గంటలకు యోగివేమన యూనివర్శిటీ లో రోడ్‌రేస్ పోటీలు ఉంటాయన్నారు. అదేరోజు 9గంటలకు కడప నగర డీఎస్ఏ మైదానంలో గల రింక్‌లో ఎంపిక పోటీలు జరగనున్నాయన్నారు. ఇందులో పాల్గొనే బాలబాలికలు ఏజ్ గ్రూపు వివరాలిలా.. 4 నుంచి 6 సంవత్సరాలు, 6 నుంచి 8, 8 నుంచి 10, 10 నుంచి 12, 12 నుంచి 15, 15 నుంచి 18 సంవత్సరాల్లోపు వారు పాల్గొనేందుకు అర్హులన్నారు. జిల్లాలోని ఔత్సాహిక స్కేటింగ్ క్రీడాకారులు తప్పక పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి తద్వారా అంతర్‌జిల్లాల రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక కావాలని కోరారు.

న్యాయం చేయాలని కోరితే నోటీసులా?

● ఆర్డీఓను ప్రశ్నించిన రైతులు



పులివెందుల ఆర్డీఓ కార్యాలయం ఎదుట నోటీసులు అందుకున్న రైతులు

పులివెందుల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా న్యాయం చేయాలని కోరితే నోటీసులు ఇవ్వడం ఏమిటని వేముల మండలం చింతలజూటూరు గ్రామ రైతులు ఆర్డీఓను ప్రశ్నించారు. గురువారం ఆర్డీఓ చిన్నయ్యను రైతులు కలిసి తమ ఆవేదనను వెలిబుచ్చారు. పలువురు రైతులు మాట్లాడుతూ బెంగళూరు టు విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా వేముల మండలం చింతలజూటూరు గ్రామం పరిధిలో పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) ఉందన్నారు. ఆ కెనాల్‌పై అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మిస్తున్నారన్నారు. అయితే బ్రిడ్జి కింద నుంచి పొలాలకు వెళ్లేందుకు వ్యవసాయ యంత్రాలు పోయేందుకు వీలుండదన్నారు. ఈ సమస్య గురించి ఆర్డీఓ చిన్నయ్యను మూడు నెలల కిందట కలిసి వినతిపత్రం సమర్పించామన్నారు. ఆర్డీవో సమస్యకు పరిష్కారం చూపకుండా న్యాయం చేయాలన్న రైతులకే నోటీసులు పంపించారన్నారు. అలాగే డీబీఎల్ కంపెనీ చేస్తున్న అక్రమంగా మట్టి తరలింపు గురించి ఆర్డీఓకు వివరించామన్నారు. ఇందుకు ఆర్డీఓ స్పందిస్తూ కెనాల్ వద్ద జరుగుతున్న పనులను మళ్లీ ఒకసారివచ్చి చూసి పరిష్కరిస్తామని చెప్పారన్నారు. అలాగే మట్టి తరలింపుపై సంబంధిత అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో చింతలజూటూరు, పెద్దజూటూరు, గొల్లలగూడూరు, పెర్నపాడు రైతులు, మద్దతుగా బీజేపీ, టీడీపీ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ జిల్లా జట్టుకు మహల్ విద్యార్థినులు



జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

కలికిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-19 జట్టుకు ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు మహల్ జడ్పీ ఉన్నత పాఠశాల(తెలుగు) హెచ్ఎం రామప్రసాద్ తెలిపారు. సీటీఎంలో జరిగిన ఎంపికలో కె.మెహరూన్, కె.భువనేశ్వరి, ఎం.హితిక ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారని ఆయన తెలిపారు. వీరు త్వరలో పశ్చిమ గోదావరి జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన వివరించారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థినులు, వారికి తర్ఫీదు ఇచ్చిన పీడీ రియాజ్ అహ్మద్‌ను గురువారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మెరుగైన జీవనానికి ఫుడ్ టెక్నాలజిస్టులు ప్రయత్నించాలి



ఉత్పత్తులలో కల్తీలు కనుగొనే విధానాన్ని వివరిస్తున్న విద్యార్థినులు

పులివెందుల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మెరుగైన ఆహార ఉత్పత్తులు, పౌష్టికాహారం ద్వారా మెరుగైన జీవితాన్ని అందించడానికి ఫుడ్ టెక్నాలజిస్టులు ప్రయత్నించాలని ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధవ సూచించారు. గురువారం ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఆహార ఉత్పత్తుల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. డీన్ మాట్లాడుతూ ప్రస్తుతకాలంలో పోషకాహార లోపం, ఊబకాయం వంటి సమస్యలతో ప్రజలు సతమతమవుతు న్నారన్నారు. ఇలాంటి సమస్యలను అధిగమించడానికి ప్రతి ఒక్కరు రోజూ సమతుల్య ఆహారం తీసుకోవాలని చెప్పారు. బెంగుళూరు గ్లోబల్ గ్రీన్‌కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ చంద్రమోహన్, ప్రొద్దుటూరు శ్రీనిధి డెయిరీ క్వాలిటీ డిపార్ట్‌మెంట్ హెడ్ జె.చంద్రశేఖర్, పులివెందుల వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ లక్ష్మీపతి హాజరై మాట్లాడారు. ఆహార భద్రత, ఆహార పదార్థాలను నిల్వ ఉంచడానికి కొత్తపద్ధతులను కనుగొనాలని, పరిశోధన దృక్పథంతో ఆలోచించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం నాల్గవ సంవత్సరం విద్యార్థులు తమ ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్ ప్రోగ్రాంలో తయారుచేసిన ఆహార ఉత్పత్తులు ప్రదర్శించారు. మూడవ సంవత్సరం విద్యార్థులు పసుపు, కారం, ఉప్పు, మిరియాలు, కాఫీ పౌడర్, వంట నూనె, పాలు, పెరుగు, పన్నీర్ వంటి ఆహార పదార్థాలలో కల్తీని అతి సులువుగా కనుగొనే పద్ధతులను ప్రదర్శించారు. అలాగే సాహిత్య పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్టూడెంట్ యాక్టివిటీ అధికారి డాక్టర్ కీర్తిరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ జయమ్మ, డాక్టర్ రాజేష్, ఇంజనీర్ నజ్మా, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ జాకీర్ బాష, బి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు గుంతలకు మరమ్మతులు



గుంతలను పూడుస్తున్న బీవైఎస్ నేతలు

మదనపల్లె టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కోమటివానిచెరువు కట్ట రోడ్డుపై ఏర్పడిన గుంతలను బహుజన యువసేన నేతలు మట్టితోలి మరమ్మతు పనులు చేపట్టారు. గురువారం కోమటివానిచెరువుపై నిర్వహించిన కార్యక్రమంలో సుమారు కిలోమీటరు పొడవునా రోడ్డును పరిశీలించి, గుంతల్లో మట్టిని నింపి చదును చేశారు. బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ వర్షాలతో రోడ్లు గుంతలు పడ్డాయని అటు మున్సిపల్, ఇటు ఆర్‌అండ్‌బీ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా అధికారులు స్పందించలేదన్నారు. ప్రజల ప్రాణాలకు విలువ ఇచ్చి తామే తొలుత కోమటివానిచెరువు రోడ్డుపై గుంతలకు మరమ్మతు చేయిస్తున్నామన్నారు. బీవైఎస్ నేతలు జిలానిబాషా, రెడ్డిశేఖర్, హరికృష్ణ, వినయ్, లోకేష్, సాయికిరణ్ పాల్గొన్నారు.

రాష్ట్ర వాలీబాల్ పోటీలకు ఆదర్శ విద్యార్థినులు



విద్యార్థినులతో పీడీ ఇందిర

రామసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దిన్నిపల్లె ఆదర్శ పాఠశాల ఇంటర్ విద్యార్థినులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మునిస్వామినాయక్ తెలిపారు. ఇంటర్ విద్యార్థినులు ఎస్.అర్చన, నోమిషా ఉమ్మడి చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగిన అండర్-19 జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. పాఠశాల పీడీ ఇందిర, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వీరి ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ములకలచెరువులో ఆటో ర్యాలీ



ఆటో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంవీఐ ఎస్‌ఐలు శ్రీహరి, శివలింగయ్య

ములకలచెరువు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌లో భాగంగా గురువారం ములకలచెరువులో మదనపల్లె ఎంవీఐ అధికారులు ఆటో ర్యాలీ చేపట్టారు. మదనపల్లె మోటార్, వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీహరి, శివలింగయ్య ఆటో డ్రైవర్లతో కలిసి అవగాహన ప్రదర్శన చేపట్టారు. రవాణా, లాజిస్టిక్స్ రంగానికి ఎన్డీఏ ప్రభుత్వం గిఫ్ట్ ఇచ్చిందని నినాదాలు చేశారు. ఈఓఆర్డీ మోహన్‌ప్రతాప్, కార్యదర్శి ఆజాద్, ఆటోడ్రైవర్ల యూనియన్ నేతలు మహబూబ్ బాషా, ఖాదర్‌బాషా, కట్టుబడి మస్తాన్, మహమ్మద్ రఫీ, రమణ, వెంకటరమణ, నరసింహులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీల్లో సత్తా చాటిన కేజీబీవీ విద్యార్థులు



పతకాలను సాధించిన అట్లూరు కేజీబీవీ విద్యార్థులు

అట్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో అట్లూరు కస్తూర్బా గురుకుల కళాశాల, పాఠశాల విద్యార్థులు పాల్గొని వెండి, రజత పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రత్యేక అధికారి ఫణిశ్రీ తెలిపారు. బాక్సింగ్ క్రీడల్లో చైతన్యలక్ష్మి వెండి పతకం సాధించిందన్నారు. శిరీషా, హిమశైలజ, వెంకటేశ్వరి, క్రిష్ణకావ్య రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. ఉషూ క్రీడల్లో ఝాన్సీ హిమశైలజ. వెండి పతకం సాధించారు. అండర్ -17 ఉషూ క్రీడల్లో తనూజా, రజిత పతకం సాధించినట్లు తెలిపారు. వీరిని పీఈటీ ఉపాధ్యాయురాలు ప్రమీల అభినందించారు.

పీఎం సభకు తరలిన కూటమి నేతలు



బహిరంగ సభకు వెళుతున్న కూటమి నేతలు

తంబళ్లపల్లె, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా నన్నూరులో నిర్వహించిన పీఎం బహిరంగ సభకు తంబళ్లపల్లె నుంచి కూటమి నేతలు తరలివెళ్లారు. సభకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వస్తుండడంతో తంబళ్లపల్లె బీజేపీ నేతల ఆధ్వర్యంలో కూటమి నేతలు కర్నూలుకు బయలు దేరారు. గురువారం ఉదయం పలు గ్రామాల నుంచి కూటమి నేతలు, కార్యకర్తలు తంబళ్లపల్లెకు చేరుకుని అక్కడి నుంచి బస్సులు, వాహనాల్లో బహిరంగ సభకు తరలివెళ్లారు. బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ శంకర్‌రెడ్డి, మగ్గాలు లక్ష్మయ్య, హరినాథరెడ్డి, సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులరెడ్డి, జయరాం, భూపతి, సురేంద్ర, మహిళా టీడీపీ నేత రామలక్ష్మీ ఉన్నారు.

జీఎస్టీతో రవాణా రంగానికి అధిక ప్రయోజనం



ఆటో డ్రైవర్లతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న రవాణా శాఖాధికారులు

పీలేరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణలతో రవాణా రంగానికి అధిక ప్రయోజనం కలుగుతుందని పీలేరు ఎంవీఐ విజయ కుమారి పేర్కొన్నారు. గురువారం ఆటో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ జీఎస్టీ 2.0 ద్వారా ట్రాక్టర్లు, చిన్న, మధ్య తరహా కార్లు, ఆటోల ధరలు, విడి భాగాల ధరలపై జీఎస్టీని తగ్గించారన్నారు. అనంతరం ఎంవీఐ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఆటో యూనియన్ నేతలు బోదేషావలి, రమణ నాయక్, వెంకటేశ్, నాగేశ్వర్, సుబ్బయ్య, లవకుమార్, గంగయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

ములకలచెరువు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ - 19 హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థులు పావణి, నాజీమ్, నెట్ బాల్‌కు రెడ్డి ప్రసన్న, లాంగ్ జంప్‌కు ఆరిఫ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కవిత, పీడీ ముషహిద్ ముస్సేన్ తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

అంతర్ కళాశాల క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్శిటీ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన అంతర్ కళాశాలల పోటీల్లో మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. బుధవారం నిర్వహించిన పోటీల్లో మహిళా విభాగంలో ఖోఖో ఫైనల్స్‌లో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలతో పోరాడి రన్నర్స్‌గా నిలిచారు. బాస్కెట్‌బాల్ క్రీడలో మహిళా యూనివర్సిటీ జట్టుతో తలపడి రన్నర్స్‌గా నిలిచారు. ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీలు శరత్, జగదీష్ విద్యార్థులను అభినందించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

రామసముద్రం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ గఫూర్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ సాగు ద్వారా ఉత్పత్తులైన తాజా కూరగాయలు, సామలు, కొర్రలు, రాగులు, ఊదలు, జొన్నలు మొదలగు చిరుధాన్యాల వాడకంతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించి వాటి ఉత్పత్తులను వినియోగదారులకు అమ్మకాలు చేశారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సభ్యులు విజయలక్ష్మి, రెడ్డెమ్మ, గాయత్రి, పద్మావతి, పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతిపై విచారణ చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న పులి శ్రీనివాసులు

పీలేరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో జరిగిన గిరిజన మహిళ అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏపీ గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా సదుం మండలం కొత్తపల్లె వాసి కె.విజయ(45) పీలేరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోందన్నారు. విధుల కోసం మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన ఆమె బుధవారం ఉదయం కొత్తపల్లె సమీప వ్యవసాయ పొలాల్లో శవమై తేలిందన్నారు. ఆమెను హత్య చేసినట్లు తమకు అనుమానాలున్నాయని, పోలీసులు నిష్పక్షపాతంగా, సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలన్నారు. ఆమె కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లిస్తూ, ఆమె కుమారులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గిరిజన సంఘ నేతలు కిల్లా విజయ్ కుమార్, ఎంఆర్‌పీఎస్ నాయకులు పురుషోత్తం, గురునాథ్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి


శిక్షణలో సూచనలిస్తున్న ఈఈ గంగాధరం

మదనపల్లె టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సబ్‌స్టేషన్లలో డ్యూటీ ఆపరేటర్లు విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో డివిజన్‌లో పనిచేస్తున్న డ్యూటీ షిఫ్ట్ ఆపరేటర్లకు ఒకరోజు శిక్షణలో ఈఈ మాట్లాడుతూ సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు వేయడంలో డ్యూటీ ఆపరేటర్లు నైపుణ్యం ప్రదర్శించాలన్నారు. సురక్షితమైన పరికరాలు, వస్తువులు ఉపయోగిస్తూ, ముందు జాగ్రత్తలు తీసుకుంటూ విద్యుత్ సరఫరా నిర్వహించాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఎల్‌సీలు తీసుకునేటప్పుడు విధుల్లో వున్న ఎస్పీడీసీఎల్ అధికారులు, ఉద్యోగులకు మాత్రమే సమాచారం ఇచ్చి ఎల్‌సీలు ఇవ్వాలన్నారు. సమయపాలన పాటిస్తూ, రైతులకు అందుబాటులో వుండాలన్నారు. కార్యక్రమంలో డీపీ ఈఈ దామోదరం, టీపీ ఈఈ విజయభాస్కర్, ఏడీఈలు హరికుమార్, సురేంద్రనాయక్, ఆదినారాయణ, ఏఈలు అజయ్‌బాబు, రఫి, కుమార్‌బాబు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగునాయక్



మదనపల్లె టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బంజారా సేవాసంఘం అధ్యక్షుడిగా జిల్లా మదనపల్లెకు చెందిన బుక్యా నాగూనాయక్ ఎన్నికయ్యారు. బుధవారం గుంటూరులో ఆలిండియా బంజారా సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ చక్రీనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలోని అన్ని తండాలు పర్యటించి బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లా అధ్యక్షుడిని పలువురు బంజారాలు అభినందించారు.

అభివృద్ధి పథంలో నడిపిస్తా

విద్యుత్ సమస్య, రీసర్వేపై నేతల ఫిర్యాదులు ● సమీక్షలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

కలికిరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నల్లారి కుటుంబాలను ఎంతగానో ఆదరించిన కలికిరి, కేవీపల్లె మండలాలను అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో వరుస సమీక్షల్లో భాగంగా గురువారం కలికిరి, కేవీపల్లె మండలాల్లో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ తమ కుటుంబం రాజకీయ జీవితం ప్రారంభమైనప్పటి నుంచీ కలికిరి, కేవీపల్లె మండల ప్రజలు తమ తండ్రి, సోదరుడు, తనను అక్కున చేర్చుకున్నారన్నారు. ఆ రెండు మండలాలను అభివృద్ధి పథంలో నడిపి ప్రజల రుణం తీర్చుకుంటానని, ఈ రెండు మండలాలకు ఝరికోన ప్రాజెక్టు నుంచి సురక్షిత తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామన్నారు. ఝరికోన ప్రాజెక్టుకు ఇది వరకు రూ.66 లక్షల నిధులు మంజూరు చేయించానని, ఆ నిధులతో మోటార్లు, పైప్‌లైన్ రిపేర్లు పూర్తి చేసి త్వరలోనే నీటి సరఫరా చేస్తామన్నారు. రెండు మండలాల్లోనూ పంచాయతీల వారీ అటు అధికారులు, ఇటు నేతలను పిలిచి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భూముల రీసర్వే, విద్యుత్ సమస్యలు అధికంగా ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయి. ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు మార్చడం కోసం విద్యుత్ సిబ్బంది రైతుల నుంచి డబ్బు డిమాండ్ చేస్తున్నారని ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. లంచాలు అడుగుతున్న సిబ్బంది పట్ల కఠినంగా వ్యవహరించాలని, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించమని ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, ఏడీఈ శివయ్య, డీటీ సయ్యద్‌ను ఆదేశించారు. గుట్టపాళెం పంచాయతీ పూలకొండకు తారు రోడ్డు కావాలని బర్నేపల్లె, వాడవాండ్లపల్లె ప్రజలు కోరడంతో వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే పంచాయతీరాజ్ డీఈ కమలాకర్ రెడ్డి ఆదేశించారు. జంగమ సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వాసనూరి చంద్రశేఖర్, సింగిల్ విండో చైర్మన్లు నల్లారి చంద్రకుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీకర రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాలతి, కలికిరి పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేశ్ రెడ్డి, ఎంపీడీఓ భానుమూర్తి, నేతలు నిజాముద్దీన్, గీతమ్మ, రెడ్డప్ప రెడ్డి, నాగభూషణం రెడ్డి, సహదేవరెడ్డి, రమేశ్ బాబు, కండక్టర్ రమణ, శివారెడ్డి, కుప్పం రవిచంద్రారెడ్డి, రమణా రెడ్డి, వగళ్ల చిన్నా, అన్ని గ్రామాల సర్పంచులు, సచివాలయ సిబ్బంది, అధికారులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమస్యలు వింటున్న నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కలకడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కోన బస్‌స్టాప్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయలయ్యాయి. నంద్యాల జిల్లా అహోబిళం వాసి మల్లికార్జున, నెల్లూరు జిల్లా రాపూరు వాసి బుజ్జయ్య బొగ్గులు తయారీ చేస్తూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో పనుల వద్దకు ద్విచక్రవాహనంలో వెళుతుండగా ఎల్లమగుడిబండ నుంచి వచ్చిన కారు వీరి వాహనాన్ని ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో మల్లికార్జున కాలు, బుజ్జయ్య తలకు గాయాలు కాగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం 108లో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గ్రామ స్వచ్ఛతకు పనిచేయాలి

కలకడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పారిశుధ్యం లోపించకుండా గ్రామ స్వచ్ఛతకు పనిచేయాలని ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓ శైలజ పంచాయతీ కార్మికులకు సూచించారు. కలకడ సచివాలయంలో ఆమె 16మంది కార్మికులకు సబ్బులు, తొడుగులు, పాదరక్షలు పంపిణీ చేశారు. జవాద్‌అలీఖాన్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

పీఎం మోదీని కలిసిన మైఫోర్స్ మహేష్



మదనపల్లె, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా నన్నూరులో నిర్వహించిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ బహిరంగ సభకు వచ్చిన పీఎం నరేంద్ర మోదీని ఎపీఐఐపీ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ కలిశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సభ అనంతరం హెలీపాడ్ వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం సమక్షంలో మోదీని కలిసి వీడ్కోలు పలికారు.

దళితవాడల్లో శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలి


సమస్యలను పరిష్కరించాలంటూ నిరసన తెలుపుతున్న మహిళలు

నిమ్మనపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని దళితవాడల్లో శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి శోభ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ తపస్వినికి మహిళలతో కలసి వినతి పత్రం అందజేసిన ఆమె మాట్లాడుతూ దళితవాడల్లో శ్మశానవాటికను ఏర్పాటు చేసి రోడ్లు కాల్వలు నిర్మించాలని తెలిపారు. దళితవాడల్లో మౌలిక సదుపాల కల్పనకు అధికారులు ముందుకురావాలన్నారు. రేషన్‌కార్డు లేని కుటుంబాలకు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరికీ ఉపాధి జాబ్‌కార్డులు ఇచ్చి వారిని ఆదుకోవాలని పురుషులతో సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్వతమ్మ, శ్యామల, రెడ్డెమ్మ, రమాదేవి, ఈశ్వరయ్య, భాగ్యమ్మ పాల్గొన్నారు.

కష్టపడ్డ వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వండి


పసుపులేటి హరిప్రసాద్‌తో సాయినాథ్

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన వారికే నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని తంబళ్లపల్లె నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్, పెద్దతిప్పసముద్రం మండల నేత సోమశేఖర్ అన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల నేతలు, కార్యకర్తలతో కలిసి తిరుపతి జనసేన పార్టీ కార్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షుడు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌ను బుధవారం కలిశారు. ఆయనతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి తేచ్చేందుకు తామంతా కష్టపడి పని చేశామని కష్టపడ్డ వారికి ప్రాధాన్యం కల్పించి పార్టీలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో ఉన్న జనసేన నేతలకు అధిక ప్రాధాన్యత కల్పించి పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఆరు మండలాల జనసేన నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో హ్యామర్‌హెడ్ వార్మ్



తంబళ్లపల్లె, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అరుదుగా కన్పించే హ్యామర్‌హెడ్ వార్మ్ తంబళ్లపల్లెలో ప్రత్యక్షమైంది. మల్లయ్యకొండ కింద సమీప పొలాల్లో బుధవారం సాయంత్రం వ్యవసాయ పనులకు వెళ్లిన కూలీలకు ఈ పాము కంట పడింది. సుమారు 10 సెం.మీ ఉన్న ఈ పాము నలుపు రంగులో ఉండి తల భాగం వైపు సుత్తిలా ఉండి వానపాములాగా ఉంది. హ్యామర్ హెడ్ వార్మ్‌గా పిలువబడే ఈ పాములు మన ప్రాంతాల్లో అరుదుగా కనిపిస్తాయి. ఈ పాము 10 నుంచి 18 సెం.మీల వరకు పెరుగుతుందని, మనుషులకు ఎటువంటి హాని కలగచేయదని అటవీ అధికారులు తెలిపారు. భూమి లోపల ఉండే ఈ పాము వర్షం కురిసిన సమయాల్లో అరుదుగా బయటకు వస్తుంటాయని తెలిపారు.

రేపు ధర్మపథంలో శనీశ్వరుడికి మహాతైలాభిషేకం

వాల్మీకిపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ధర్మపథంలో శనివారం ప్రదోషకాలంలో శనీశ్వరుడికి మహాతైలాభిషేకం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు ప్రకటించారు. పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 18వ తేదీన శనివారం శనిత్రయోదశి ప్రదోష సమయంలో శనీశ్వరస్వామికి మహాతైలాభిషేకం నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ఆటో, లారీ ఢీ - నలుగురికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

ములకలచెరువు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పెట్రోల్ బంకు సమీపంలోని ముంబై - చెన్నై జాతీయ రహదారిలో గురువారం రాత్రి లారీ ఆటోను ఢీకొనడంతో శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌కు చెందిన నలుగురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌కు చెందిన పద్మావతమ్మ, మల్లిక సహా మరో ఇద్దరు మహిళలు ప్యాసింజర్ ఆటోలో మద్దినాయనిపల్లెలో బంధువు అంత్యక్రియలకు హాజరయ్యారు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా ములకలచెరువు వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు మహిళలు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

తంబళ్లపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సిబ్బంది ముమ్మరంగా పారిశుధ్యంపై చర్యలు చేపట్టారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో మండల కేంద్రంలో రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఈ క్రమంలో కార్యదర్శి శ్రీనివాసరావు గురువారం సాలె వీధిలో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేయించారు. మురుగు నీటి కాల్వలు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడవేయరాదని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పారిశుధ్యం కార్మికులు పాల్గొన్నారు.